
ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS
మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 29-04-2026 | సంపుటి - 27 | సంచిక -337 | రూ : 4 | పేజీలు: 8



# భావితరాల కోసమే ఫ్యూచర్ సిటీ

- మరో సింగపూర్‌ను సృష్టిస్తాం..ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం
- నిరుద్యోగ యువతకు
- ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- ఫ్యూచర్‌సిటీలో కలపమని సమీప గ్రామాల నుంచి వినతులు వస్తున్నాయి
- పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి
- 20మంది మావోయిస్టులకు టూరిస్ట్‌గైడ్‌లుగా నియామకపత్రాలు



2లో

రాష్ట్ర పోలీస్ సారథి
# సీవీ ఆనంద్..



- నూతన డీజీపీగా నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 30న ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ
- అదే రోజు లేదా మే1న ఆనంద్ బాధ్యతల స్వీకరణ!

2లో

నేడు పశ్చిమ బెంగాల్‌లో
# ఎన్నికలు

- రెండోదశలో 142 స్థానాలకు పోలింగ్
- ఓటరు చేతిలో 1,448 మంది అభ్యర్థుల భవితవ్యం
- మే 4న తుది ఫలితాలు



కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌లో బుధవారం రెండోదశ పోలింగ్ జరగనున్నది. ఏడు జిల్లాల పరిధిలోని 142 నియోజకవర్గాల్లో ఉన్న సుమారు 3.21 కోట్ల మంది ఓటర్లు 1,448 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న జరుగుతుంది. మొదటి దశ పోలింగ్‌లో 90 శాతానికి పైగా ఓటింగ్ నమోదై రికార్డు సృష్టించింది.

**మోహరించిన కేంద్రబలగాలు**

ఈ మేరకు ఎన్నికల సంఘం(ఈసీ) విస్తృతమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టింది.

తరువాయి 2లో



సైనిక వ్యయంలో
# భారత్ @ 5

- ప్రపంచ సైనిక వ్యయంలో 5వ స్థానానికి చేరిన భారత్
- 2025లో భారత్ రక్షణ వ్యయం 92.1 బిలియన్ డాలర్లుగా నమోదు
- 2024తో పోలిస్తే 8.9 శాతం పెరిగిన భారత సైనిక ఖర్చు
- రెండో స్థానంలో చైనా.. 31వ స్థానంలో పాకిస్థాన్
- ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం 2.8 ట్రిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరిన వైనం

2లో

# సిక్కింలో మోదీ జోరు..
## రూ. 4 వేల కోట్ల పనులకు శ్రీకారం!

- సిక్కిం రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50 ఏళ్లు
- ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిన ప్రధాని
- తన చిన్ని స్నేహితులతో ఫుట్‌బాల్ ఆటను ఎంజాయ్ చేశానన్న ప్రధాని

2లో





2లో

అమరావతి నుంచి హైదరాబాద్‌కు..
# 70 నిమిషాల్లో!

- బుల్లెట్ రైలు ప్రాజెక్టుతో త్వరలోనే సాకారం
- జూన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యకలాపాలు
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు..
# ఈసారి వాట్సాప్‌లోనూ రిజల్ట్స్ !

- రేపు మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ పదో తరగతి ఫలితాలు
- దాదాపు 5.15 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం వెల్లడి
- ఈ ఏడాది కొత్తగా వాట్సాప్‌లోనూ ఫలితాలు తెలుసుకునే సౌకర్యం
- నిర్ణీత నంబర్‌కు 'హాయ్' అని పంపి రిజల్ట్స్ సులభంగా పొందొచ్చు



2లో

ఇరాన్ శాంతి ప్రతిపాదనలకు
# రష్యా మధ్యవర్తిత్వం



- అగమ్యగోచరంగా అమెరికా పరిస్థితి చర్చలపై ఇరాన్ సమాలోచనలు
- అగమ్యగోచరంగా అమెరికా పరిస్థితి
- ముందుకెళ్తే చైనా..వెనక్కొస్తే ఇరాన్
- యుద్ధంలో ఇరుక్కున్న ట్రంప్
- ఒపెక్, ఒపెక్ ప్లస్‌కు యూఏఈ గుడ్‌బై

2లో

# భావితరాల కోసమే ఫ్యూచర్ సిటీ

కందుకూరు: భవిష్యత్ తరాల కోసమే ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దీన్ని మరో సింగపూర్‌గా తీర్చి దిద్ది, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను అమలు చేస్తుందని స్పష్టంచేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ రెవెన్యూ పరిధిలో ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్ భవనానికి మంగళవారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌రాబు, జూపల్లి కృష్ణారావుతో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. మల్కాజిగిరి ఆక్టోపస్ భవనం, డీసీపీ భవనం, గచ్చిబౌలిలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ భవనాలకూ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడారు. తమ ప్రభుత్వం మానవతా దృక్పథంతో ప్రజా పాలనకు కృషి చేస్తోందన్నారు. గ్రామాలను ఫ్యూచర్ సిటీలో చేర్చాలని వినతులు వస్తున్నాయని తెలిపారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో ఉన్న ఆయా గ్రామాల సర్పంచులు గ్రామసభలు నిర్వహించి, గ్రామసభ పత్రాలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి అందజేయాలని సూచించారు. అనంతరం ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ప్రపంచంలోనే ఉన్నతంగా ఉండాలనే లక్ష్యంతో ఫ్యూచర్ సిటీలో పోలీస్ కమిషరేట్ భవనం నిర్మిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

**అభివృద్ధి పనుల్లో పరుగు**

60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులు పూర్తవుతున్నాయనీ, రెండు నెలల్లో స్కిల్ భవనాన్ని ప్రారంభోత్సవం చేస్తామన్నారు. దేశంలోనే ఎక్కడా లేని 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టామన్నారు. రైతులకు నష్టం కాకుండా గిట్టుబాటు ధర వచ్చేటట్టు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అన్ని శాఖల అధికారులు సామాన్య ప్రజల పట్ల మానవీయ కోణంలో ఆలోచించి, తమ దగ్గరకు వచ్చిన వారి సమస్యల్ని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

**శంషాబాద్‌లో బుల్లెట్ రైల్వేస్టేషన్**

దేశంలో ఏడు బుల్లెట్ ట్రైన్స్ మంజూరు చేస్తే మూడు మన రాష్ట్రానికే వచ్చాయనీ, బెంగళూరు హైదరాబాద్, శంషాబాద్‌పూణే, శంషాబాద్ అమరావతిచెన్నై వరకు బుల్లెట్ ట్రైన్‌కు మార్గం సుగమమైందని వివరించారు. దీనితో రంగారెడ్డి జిల్లాలో అద్భుతం జరగబోతోందన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు దగ్గర మెట్రో రైలు, బుల్లెట్ రైలు నిర్మాణం కోసం స్టేషన్లు నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రం శాంతి భద్రతలు బాగున్నాయంటే దానికి పోలీసులే కారణమన్నారు. మిగిలిన మావోయిస్టులు జన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు 820 మంది మావోయిస్టులు లొంగి పోయారని తెలిపారు. గణపతి అనారోగ్యంగా ఉన్నారని తమకు తెలిసిందనీ, వారు లొంగిపోతే ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

*** జూన్ 2న ఎఫ్‌టీడీసీ కార్యాలయం ప్రారంభం**

ప్రస్తుత ఫ్యూచర్‌సిటీ ప్రాంతంలో కాలుష్యాన్ని ప్రేరేపించే ఫార్మాస్యూటికల్ కంపెనీలను ఏర్పాటు చేయడానికి గత పాలకులు ప్రయత్నాలు చేశారనీ, వాటిని కాదని తాము భవిష్యత్ నగరాన్ని నిర్మిస్తున్నామన్నారు. జూన్ 2లోగా ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఇక్కడి నుంచే సమీక్షలు నిర్వహించి పెట్టుబడులను ఆహ్వానిస్తామని తెలిపారు.

# నేడు పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు



కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌లో బుధవారం రెండోదశ పోలింగ్ జరగనున్నది. ఏడు జిల్లాల పరిధిలోని 142 నియోజకవర్గాల్లో ఉన్న సుమారు 3.21 కోట్ల మంది ఓటర్లు 1,448 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న జరుగుతుంది. మొదటి దశ పోలింగ్‌లో 90 శాతానికి పైగా ఓటింగ్ నమోదై రికార్డు సృష్టించింది.

**మోహరించిన కేంద్రబలగాలు**

ఈ మేరకు ఎన్నికల సంఘం(ఈసీ) విస్తృతమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టింది. ఏడు జిల్లాల్లో కలిపి 2,321 కంపెనీల కేంద్ర బలగాలను మోహరించింది. కోల్‌కతాలో బలగాల మోహరింపు అధికంగా ఉంది. ఇక్కడ 273 కంపెనీల బలగాలు మోహరించాయి. మొత్తం 142 మంది సాధారణ పరిశీలకులు, 95 మంది పోలీసు పరిశీలకులు, 100 మంది వ్యయ పరిశీలకులను నియమించారు.

**ఓటర్ల పరంగా చూస్తే..**

రెండో విడతలో భాగంగా మొత్తం 3.21 కోట్ల మంది ఓటర్లలో.. 1.64 కోట్ల మంది పురుషులు, 1.57 కోట్ల మంది స్త్రీలు, 792 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. భౌగోళిక విస్తీర్ణం పరంగా ఎన్నికలకు వెళ్తున్న నియోజకవర్గాల్లో అత్యంత చిన్నది కోల్‌కతాలోని జోరాసంకో కాగా, అత్యంత పెద్దది నదియాలోని కళ్యాణి. ఓటర్ల సంఖ్య పరంగా అత్యంత చిన్న నియోజకవర్గం భాట్‌పారా (1,17,195 మంది ఓటర్లు) కాగా, అత్యంత పెద్దది చుంచురా (2,75,715 మంది ఓటర్లు). రెండవ దశలో ఎన్నికలకు వెళ్తున్న 142 స్థానాలు ఏడు జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఇందులో ఉత్తర 24 పరగణాలు (33 స్థానాలు), దక్షిణ 24 పరగణాలు (31), నదియా (17), హౌరా (16) కోల్‌కతా (11),

# ఇరాన్ శాంతి ప్రతిపాదనలకు రష్యా మధ్యవర్తిత్వం

టెహ్రాన్/వాషింగ్టన్ : రష్యా అందిస్తున్న మద్దతుకు, సంఘీభావానికి ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కృతజ్ఞతలు తెలిపారు. అరాగ్చీ సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో సమావేశమైన విషయం తెలిసిందే. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను నివారించే విషయంలో మధ్యవర్తిత్వం వహించేందుకు రష్యా సానుకూలత వ్యక్తం చేసిందని సమాచారం. చర్చలను తిరిగి ప్రారంభించాలన్న అమెరికా అభ్యర్థనను ఇరాన్ పరిశీలిస్తోందని అరాగ్చీ తెలిపారు. తొలి విడత చర్చలు విఫలం కావడానికి అమెరికాయే కారణమని ఆయన ఆరోపించారు. ఇరాన్‌కు చెందిన రెండు చమురు నౌకలు మెజెస్టిక్ ఎక్స్, తిఫానీలను అమెరికా స్వాధీనం చేసుకోవడంపై టెహ్రాన్ విదేశాంగ శాఖ మండిపడింది. ఈ చర్య సముద్ర దోపిడీని చట్టబద్ధం చేస్తోందని ధ్వజమెత్తింది. ఇదిలావుండగా యుద్ధానికి ముగింపు పలికేందుకు, హార్ముజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ అందజేసిన తాజా శాంతి ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతీయ భద్రతా బృందం సమీక్షిస్తోంది. చర్చలలో తమ అణు కార్యక్రమాన్ని ప్రస్తావించవద్దని, దానిపై తర్వాత చర్చిద్దామని ఇరాన్ సూచించింది. అయితే ఇరాన్ ప్రతిపాదనలపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారని, వాటిని ఆయన ఆమోదించబోరని అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. హార్ముజ్ జలసంధిని తక్షణమే, ఎలాంటి ఆటంకాలు లేకుండా తెరవాలంటూ పలు దేశాలు కోరుతున్నాయి. బహ్రైన్ నేతృత్వంలో ఆయా దేశాలు ఈ మేరకు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

*** దిగ్బంధాన్ని తప్పించుకొని హార్ముజ్‌ను దాటుతున్న నౌకలు**

హార్ముజ్ జలసంధిని అమెరికా నౌకాదళం దిగ్బంధించినప్పటికీ అనేక చమురు నౌకలు దానిని దాటుకొని ప్రయాణం సాగిస్తున్నాయి. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌కు తూర్పు వైపున మోహరించిన అమెరికా దళాలు నౌకల రాకపోకలను నియంత్రిస్తూ, ఆంక్షలను అమలు చేస్తున్నాయి. అయితే ఇరాన్‌కు చెందిన ఖర్గ్ దీవి నుంచి నేరుగా ముంబయికి చేరుకునే మార్గం ఒకటుందని పరిశీలకులు తెలిపారు. ఇటీవలే దేశ్ గరిమ అనే భారత నౌక జలసంధిని దాటింది. జగ్ అర్నవ్, సన్మర్ హెరాల్డ్ నౌకలపై ఇరాన్ సేనలు కాల్పులు జరిపిన రోజే దేశ్ గరిమ నౌక హార్ముజ్‌ను దాటేసింది. అది గత బుధవారం ముంబయికి చేరుకుంది. ఖతార్‌లోని రాస్ లాఫన్ నుంచి బయలుదేరిన ఈ నౌకలో 97 వేల మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఒక్క దేశ్ గరిమ మాత్రమే కాదు...ఈ నెల 13న అమెరికా దిగ్బంధం అమలులోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకూ 30కి పైగా నౌకలు హార్ముజ్‌ను దాటాయి. వివిధ దేశాలకు చెందిన నౌకలు ఇరాన్ నుంచి ముంబయి వైపు వస్తున్నాయని వార్తలు అందుతున్నాయి. అయితే ఈ సమాచారాన్ని భారత్, టెహ్రాన్ అధికారులు ఇంకా ధృవీకరించలేదు. ఇప్పటి వరకూ 34 నౌకలు అమెరికా దిగ్బంధాన్ని దాటుకొని బయటికి వచ్చాయని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక తెలిపింది. హార్ముజ్ నుంచి బయటికి వచ్చిన నౌకలు పర్షియన్ గల్ఫ్‌లో ప్రవేశిస్తున్నాయని చెప్పింది. కాగా ప్రస్తుతం హార్ముజ్‌లో ఇంకా 14 భారత నౌకలు ఉన్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

హార్ముజ్‌పై నియంత్రణ ఇరాన్‌దే : ఐరాసలో రష్యా హార్ముజ్ జలసంధిని నియంత్రించే హక్కు ఇరాన్‌కే ఉన్నదని రష్యా స్పష్టం చేసింది. ఐక్యరాజ్యసమితి సమావేశంలో రష్యా రాయబారి వస్సిలీ నెబెంజియా మాట్లాడుతూ భద్రతా కారణాల దృష్ట్యా తన ప్రాదేశిక జలాలలో నౌకల రాకపోకలను నియంత్రించే అధికారం దాడికి గురైన తీర ప్రాంత దేశానికి ఉంటుందని చెప్పారు.

# రాష్ట్ర పోలీస్ సారథి సీవీ ఆనంద్

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగానికి కొత్త డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ ఆర్టీ నం.553 జారీ చేసింది. ప్రస్తుతం హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా పనిచేస్తున్న ఆనంద్‌ను బదిలీ చేసి, ఎంపిక ప్రక్రియ అనంతరం డీజీపీగా నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. యూపీఎస్సీ మార్గదర్శకాల ప్రకారం ఎంపానెల్ కమిటీ సిఫారసుల ఆధారంగా ఈ నియామకం జరిగినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామక్రిష్ణరావు వెల్లడించారు. కాగా ప్రస్తుత డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి ఈనెల 30న పదవీ విరమణ చేస్తున్నారు. అదే రోజు లేదా మరుసటి రోజు (మే 1న) రాష్ట్ర పోలీసు పగ్గాలను ఆనంద్ చేపట్టనున్నారని తెలిసింది. అదే సమయంలో మరికొందరు సీనియ ఐపీఎస్‌ల బదిలీలు కూడా జరిగే అవకాశం ఉందని సమాచారం. 1968 జూన్ 5న హైదరాబాద్ పాతబస్తీలోని పేట్లబుర్జ్ ప్రభుత్వ ఆస్పత్రిలో జన్మించిన ఆనంద్, విద్యారంగంలోనే కాక క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, నిజాం కాలేజ్‌లో చదివిన ఆయన, ఉస్మానియా యూవర్సిటీలో ఎకనామిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. యువకుడిగా హైదరాబాద్ అండర్ 19 క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ఆయన, కెరీర్ ప్రారంభంలోనే మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో ధైర్యవంతమైన ఆపరేషన్లతో గుర్తింపు పొందారు. నిజామాబాద్ ఎస్పీగా పనిచేసిన సమయంలో నక్సలిజాన్ని అదుపులోకి తీసుకువచ్చినందుకు ప్రెసిడెంట్ గ్యాలెంట్రీ మెడల్ అందుకున్నారు. హైదరాబాద్ నగరంలో డీసీపీగా పనిచేసిన సమయంలో గణేశ్ నిమజ్జన నిర్వహణలో వినూత్న మార్పులు తీసుకువచ్చారు. ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా ఈ చలాన్, డ్రంక్ డ్రైవింగ్ నియంత్రణ, ఆటోమేటిక్ సిగలింగ్ వంటి పద్ధతులను ప్రవేశపెట్టి ట్రాఫిక్ నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. సైబరాబాద్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో మహిళల భద్రత కోసం 'షీ టీమ్స్', సీసీటీవీల విస్తరణ వంటి కీలక చర్యలు చేపట్టారు. యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) డీజీగా, సివిల్ సప్లైస్ కమిషనర్‌గా ఉన్నప్పుడు రేషన్ వ్యవస్థలో ఈపాస్ యంత్రాలు, జీపీఎస్ ట్రాకింగ్ అమలు చేసి పారదర్శకతను పెంచారు.

# నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు.. ఈసారి వాట్సాప్‌లోనూ రిజల్ట్స్!

తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభవార్త. రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు రేపు (బుధవారం) విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు విద్యాశాఖ అధికారులు ఈ ఫలితాలను అధికారికంగా వెల్లడించనున్నారు. ఫలితాల విడుదలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ ఏడాది మార్చి 14వ తేదీ నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఏప్రిల్ 23వ తేదీ నాటికే జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. వాస్తవానికి మే మొదటి వారంలో ఫలితాలు ప్రకటించాలని తొలుత భావించినప్పటికీ, ఆ గడువు కంటే ముందే ఫలితాలను విడుదల చేస్తుండటం గమనార్హం.

**వాట్సాప్‌లో సులభంగా ఫలితాలు**

ఈ విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ ఎస్సెస్సీ బోర్డు ఒక వినూత్న సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు తమ ఫలితాలను సులభంగా వాట్సాప్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ఇప్పటికే హాల్‌టికెట్లను వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించిన బోర్డు, ఇప్పుడు అదే తరహాలో ఫలితాలను అందించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే వాట్సాప్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థుల మొబైల్ నంబర్‌కు ఫలితాల మెమో ఆటోమేటిక్‌గా వస్తుంది. ఒకవేళ ఆ సదుపాయం వినియోగించుకోని వారు, తమ ఫలితాలను తెలుసుకోవాలంటే.. 80969 58096 అనే వాట్సాప్ నంబర్‌కు 'Hi' అని సందేశం పంపించాలి. ఆ తర్వాత 'SSC Results' అని టైప్ చేసి, హాల్‌టికెట్ నంబర్ వంటి వివరాలు నమోదు చేస్తే, ఫలితం వారి ఫోన్ స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతుంది. ఈ కొత్త విధానం ద్వారా విద్యార్థులు సర్వర్ల రద్దీ సమస్య లేకుండా తమ ఫలితాలను వేగంగా తెలుసుకునేందుకు వీలు కలుగుతుంది.

# అమరావతి నుంచి హైదరాబాద్‌కు..70 నిమిషాల్లో!

విశాఖపట్నం: అమరావతి నుంచి హైదరాబాద్‌కు 70 నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. త్వరలో వస్తున్న బుల్లెట్ రైలు ప్రాజెక్టుతో ఇది సాకారం అవుతుందన్నారు. అమరావతి నుంచి చెన్నైకి 112 నిమిషాల్లో వెళ్లొచ్చని చెప్పారు. కోల్‌కతా నుంచి చెన్నై వరకున్న రెండు లైన్లను నాలుగు లైన్లుగా విస్తరించనున్నట్లు తెలిపారు. కంటెయినర్, సరకు రవాణా రైళ్లతో పాటు మరో 500 రైళ్లతో ఈ ప్రాంతాన్ని అనుసంధానిస్తామన్నారు. విశాఖలోని గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ శంకుస్థాపనలో మంగళవారం పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. జూన్ 1న 'దక్షిణకోస్తా రైల్వేజోన్'ను అధికారికంగా నోటిఫై చేయబోతున్నట్లు కూడా ప్రకటించారు. 'దక్షిణాదికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పూర్తిన్యాయం చేస్తోంది. ప్రతిపక్షాలు మాత్రం ప్రతి అంశాన్నీ కావాలనే రాజకీయం చేస్తున్నాయి' అని వైష్ణవ్ మండిపడ్డారు.

**గూగుల్ ఇక్కడే ఉత్పత్తి చేసుకోవాలి**

'ఐటీ సేవల్లో భారత్ గణనీయమైన ప్రగతి చూపిస్తోంది. కానీ సెమీకండక్టర్లు, చిప్‌లు, ల్యాప్‌టాప్ వంటివాటి ఉత్పత్తిలో మాత్రం వెనుకబడ్డాం. ప్రధాని చొరవతో మొబైళ్ల తయారీలో ముందున్నాం. సెమీకండక్టర్ మిషన్‌లో భాగంగా ఇప్పటికే వాణిజ్యపరమైన ఉత్పత్తిని ఇక్కడ ప్రారంభించాం. డేటాసెంటర్లకు అవసరమైన సర్వర్లను దేశంలోనే ఉత్పత్తి చేసుకోవాలని టెక్ కంపెనీలకు పిలుపునిచ్చాం. గూగుల్ కూడా తమ సర్వర్లు, సీపీయూ, చిప్‌లను ఇక్కడే ఉత్పత్తి చేసుకోవాలి. భారత్ ఇస్తున్న ఈ ఆహ్వానాన్ని గూగుల్ సీఈఓకు సంస్థ ప్రతినిధులు తెలియజేయాలి' అని అశ్వినీ వైష్ణవ్ కోరారు.

**రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ**

'దాదాపు 12 ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రూ.886 కోట్ల రైల్వే బడ్జెట్ ఉండేది. ప్రస్తుతం రూ.1.06 లక్షల కోట్ల రైల్వే పనులు ఏపీని అనుసంధానిస్తూ జరుగుతున్నాయి. ఏపీలో 74 స్టేషన్లను ఆధునికీకరిస్తున్నాం. 832 పైవంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించాం. 1,039 కిలోమీటర్ల కొత్త రైల్వేలైన్ల నిర్మాణం జరుగుతోంది. వందశాతం విద్యుదీకరణ పూర్తయింది. ఏపీ మీదుగా 16 వందేభారత్, 22 అమృత్‌భారత్‌లు నడుస్తున్నాయి' అని ఆయన వివరించారు.

## సిక్కింలో మోదీ జోరు..

# రూ. 4 వేల కోట్ల పనులకు శ్రీకారం!



సిక్కిం రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ గ్యాంగ్‌టక్ వెళ్లారు. తన పర్యటన సందర్భంగా, ఈ ఉదయం పాల్జోర్ స్టేడియంలో యువతీయువకులతో కలిసి ప్రధాని ఫుట్‌బాల్ ఆడారు. ఎంతో బిజీగా ఉండే ప్రధాని... కాసేపు యువతతో కలిసి ఆటను ఎంజాయ్ చేశారు. ఈ సందర్భంగా తన సంతోషాన్ని ఎక్స్ వేదికగా ఆయన పంచుకున్నారు. "నా చిన్ని స్నేహితులతో ఫుట్‌బాల్ ఆడటం చాలా సరదాగా, ఉత్తేజంగా అనిపించింది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా విద్య, వైద్య, మౌలిక సదుపాయాల రంగాలకు సంబంధించి రూ. 4 వేల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సిక్కిం యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్, హెలెన్ లెప్చా మెడికల్ కాలేజ్ ప్రారంభోత్సవం వంటివి ఇందులో కీలకం. ఈ పర్యటనలో భాగంగా ఈశాన్య రాష్ట్రాల కోసం 6 క్రికెట్ అకాడమీలను కూడా ప్రధాని ప్రకటించారు.

# సైనిక వ్యయంలో భారత్ @ 5

ప్రపంచంలో అత్యధికంగా సైనిక వ్యయం చేసే దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) సోమవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం 2025లో భారత్ రక్షణ వ్యయం గణనీయంగా పెరిగింది. ఈ జాబితాలో అమెరికా, చైనా, రష్యా, జర్మనీ తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచ మొత్తం సైనిక వ్యయంలో భారత్ వాటా 3.2 శాతంగా నమోదైంది. 2025లో భారత్ రక్షణ వ్యయం 92.1 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది 2024తో పోలిస్తే 8.9 శాతం అధికం. పాకిస్థాన్‌తో సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' వంటి పరిణామాల కారణంగా సైనిక సన్నద్ధతను పెంచుకోవడానికి భారత్ అత్యవసర ఆయుధ కొనుగోళ్లు చేపట్టింది. ఈ కారణాలతోనే రక్షణ వ్యయం పెరిగినట్లు నివేదిక స్పష్టం చేసింది. పొరుగు దేశాల సైనిక వ్యయం కూడా భారీగా పెరుగుతోందని ఈ నివేదిక హైలైట్ చేసింది. ప్రపంచంలో రెండో అతిపెద్ద రక్షణ వ్యయం కలిగిన చైనా, తన బడ్జెట్‌ను 7.4 శాతం పెంచుకుని 336 బిలియన్ డాలర్లకు చేర్చింది. మరోవైపు, పాకిస్థాన్ కూడా తన సైనిక వ్యయాన్ని 11 శాతం పెంచి 11.9 బిలియన్ డాలర్లకు తీసుకువెళ్లింది. ప్రపంచ దేశాల జాబితాలో పాకిస్థాన్ 31వ స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం 2025లో 2,887 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరినట్లు నివేదిక వెల్లడించింది. అమెరికా, చైనా, రష్యా.. ఈ మూడు దేశాల మొత్తం వ్యయమే 1,480 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ప్రపంచ మొత్తం వ్యయంలో 51 శాతానికి సమానం. ముఖ్యంగా ఉక్రెయిన్‌రష్యా యుద్ధం కారణంగా ఐరోపా దేశాలు తమ రక్షణ బడ్జెట్లను భారీగా పెంచుతున్నాయి. భారత్ రక్షణ వ్యయం గణనీయంగా పెరుగుతున్నప్పటికీ, విదేశీ ఆయుధ దిగుమతులపై ఆధారపడటం క్రమంగా తగ్గుముఖం పడుతుండటం గమనార్హం. ఇది రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ వేస్తున్న బలమైన అడుగులకు నిదర్శనంగా కనిపిస్తోంది.

# జన్నారంలో మత్తు పదార్థాలు, సైబర్ మోసాలపై పోలీసుల అవగాహన




ప్రజాస్ఫూర్తి, జిన్నారం : మత్తు పదార్థాల వినియోగం, బ్యాంకు ఓటీపీ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జన్నారం పోలీసులు సోమవారం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, "యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి అని, వీటి అమ్మకాలు,వినియోగం చట్టరీత్యా నేరం అని . ఎక్కడైనా డ్రగ్స్, మత్తు పదార్థాలను అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బ్యాంకు ఓటీపీ మోసాలపై మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు అధికారులమని చెప్పి ఓటీపీ, కార్డు నంబర్లు అడుగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ చెప్పవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి" అని ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమం లో గ్రామస్తులు, మహిళలు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జన్నారం లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం




ప్రజాస్ఫూర్తి, జన్నారం: జన్నారం మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ఎస్.బి.ఐ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్.ఐ ఉదయ్ కిరణ్, ఎస్.బి.ఐ మేనేజర్ అంకిత్ లు ప్రారంభించారు. గత 16 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం వేసవిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల ప్రజల దహార్తిని తీర్చడానికి ఎస్.బి.ఐ బ్యాంకు వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి బ్యాంక్ కు వచ్చే కస్టమర్లకు ఇటు మార్కెట్ స్థానిక ప్రజలకు చక్కగా ఉపయోగపడుతుందని లయన్స్ క్లబ్ వాటర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ లయన్ అనుమల రాజన్న తెలియజేశారు. స్థానిక ఎస్సై ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు తోట లచ్చన్న, కార్యదర్శి ఎర్ర ప్రవీణ్ కుమార్ ,క్లబ్ ట్రెజరర్ ప్రేమ్ సాగర్, క్లబ్ జోన్ చైర్ పర్సన్ కస్తూరి సతీష్, డిస్టిక్ కోఆర్డినేటర్లు ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, జక్కు భూమేష్, అంజితరావు ,లయన్స్ క్లబ్ సభ్యులు మారుతి రాజు, సైన్ల మల్లేష్, వెలగందుల సురేష్ ,గుండ పవన్, వావిలాల రాజేందర్, గుండ సుధాకర్, మిక్కిలినేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాన్ పవర్ డెవలప్మెంట్ కాలేజ్ చైర్మన్ మల్యాల సతీష్ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మాన్ పవర్ డెవలప్మెంట్ కాలేజ్ చైర్మన్ మల్యాల సతీష్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కలిసి చైర్మన్ సతీష్ కు భారీ కేక్ కట్ చేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులు, కాలనీ వాసులు, బాటసారులు కలిపి 800 మందికి పైగా హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా డెవలప్మెంట్ కాలేజ్ కరస్పాండెంట్ మల్యాల నాగలక్ష్మి మాట్లాడుతూ, చైర్మన్ సతీష్ జన్మదినాన్ని గత ఆరు సంవత్సరాలుగా అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాన్ పవర్ కాలేజ్ యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు, బంధువులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహబూబాబాద్ లో జాబ్ మేళా



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: జిల్లా ఉపాధి కార్యాలయం, మహబూబాబాద్ ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ బయ్యారం మరియు హైదరాబాద్ లో ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, అప్రెంటిస్ షిప్ ఖాళీలను భర్తీ చేయుటకు ఎస్ ఎస్ సి, ఇంటర్, డిగ్రీ, బి. ఫార్మసీ / డి ఫార్మసీ / యం ఫార్మసీ ఉత్తీర్ణతతో 1835 వయసు గల అభ్యర్థులకు ఈనెల 30వ తారీఖు నుండి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత మరియు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 30వ తారీకు ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, రెజ్యూమ్ తో కలెక్టరేట్ లోని జిల్లా ఉపాధి కార్యాలయం, రూమ్ నెం. 25, రెండవ అంతస్తు, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము , కురవి రోడ్, మహబూబాబాద్ నందు హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కోరారు. మరిన్ని వివరాలకు: 82476 56356, రఘుపతి, హెచ్ ఆర్ అపోలో ఫార్మసీ ను సంప్రదించగలరని అన్నారు.

# యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న నారా భువనేశ్వరి

యాదాద్రి : తెలంగాణలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం యాదాద్రిని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆలయానికి చేరుకున్న భువనేశ్వరికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం నారా భువనేశ్వరి గర్భాలయంలోని స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్శనం అనంతరం రంగమండపంలో వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనం అందజేయగా, అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, శేష వస్త్రాన్ని బహూకరించారు. మరోవైపు, వేసవి సెలవుల దృష్ట్యా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో, ఆమె పర్యటన సమయంలో సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు.

# టి జి డబ్ల్యు డబ్ల్యు సి ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవం



ప్రజాస్ఫూర్తి, జన్నారం : తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చనిపోయిన కార్మికులను స్మరించుకుందాం బ్రతికున్న వారి కోసం పోరాడుదాం అనే నినాదంతో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి దాదాపు 3 సంవత్సరాలు గడుస్తున్న గల్ఫ్ కార్మికులు ఇచ్చిన హామీలు అమలు కాక గల్ఫ్ కార్మికుల కోసం చేసిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గల్ఫ్ లో చనిపోయిన వారి కుటుంబాలకు 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా కొన్ని కుటుంబాలకు ఇచ్చినప్పటికీ, ఇంకా ఇవ్వ వలసిన మిగతా కుటుంబాలకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ నుంచి ఇంటికి తిరిగి వచ్చిన వలస కార్మికులను కనీస ఆసరా ఇస్తూ వారిని ఆదుకునే అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రవాస దివాస్ దినోత్సవం ప్రభుత్వమే జరిపించాలని వారు కోరారు. ప్రతీ గల్ఫ్ కార్మికునికి ప్రభుత్వం బీమా పథకం కల్పించాలన్నారు. ముంబయి లో ఏర్పాటు చేసిన విధంగా "విదేశ్ భవన్" ను హైదరాబాద్ లో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సేపురి గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అమరగొండ తిరుపతి, పెరుగు మల్లికార్జున్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలాజీ శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసెట్టి తిరుపతి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మహమ్మద్ హస్సన్, జన్నారం మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి, ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎలయ్య, సత్తయ్య, వివిధ గ్రామాల గల్ఫ్ కార్మికులు అందరూ పాల్గొన్నారు.

## కుషాయిగూడలో 54 అడుగుల
# భారీ హనుమాన్ విగ్రహ ప్రతిష్టకు సిద్ధం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడలో నిర్మాణంలో ఉన్న 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ప్రతిష్ట కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో, కుషాయిగూడ బజరంగ్ దళ్ , కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఈ విగ్రహ నిర్మాణం తుది దశకు చేరుకుంది. మే 1, శుక్రవారం, వైశాఖ శుద్ధ పౌర్ణమి, స్వాతి నక్షత్ర సమూహూర్తంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భారీ హనుమాన్ విగ్రహంతో పాటు మూలవిరాట్ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి, వినాయక స్వామి విగ్రహాలకు యంత్ర మంత్ర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే 28వ తేదీన సాయంత్రం దేవతామూర్తుల గ్రామోత్సవ ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. 29వ తేదీన ఉదయం, సాయంత్రం హోమాలు, దేవతామూర్తుల జలాధివాసం, 30వ తేదీ గురువారం ఉదయం, సాయంత్రం హోమాలు, ధాన్యాధివాసం కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ ప్రతిష్ట కార్యక్రమాలను శ్రీ హంపి వీరుపాక్ష విద్యారణ్య భారతి స్వామి, శ్రీ యోగానంద సరస్వతి స్వామి (అదిలాబాద్), శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, శ్రీ చిట్టి పెద్ది రామశర్మ ఆధ్వర్యంలో వైదిక బ్రాహ్మణులు యంత్ర మంత్ర ప్రాణ ప్రతిష్టగా నిర్వహించనున్నారు. విగ్రహ విశేషాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. 54 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ విగ్రహ కిరీటాన్ని రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ నుంచి తెప్పించిన జర్మాన్ రత్నంతో అలంకరించారు. స్వామివారి నేత్రాలను తమిళనాడు నుంచి ప్రత్యేకంగా తెప్పించి, సహజంగా మనిషి కళ్లలా కనిపించేలా తీర్చిదిద్దారు. హృదయ భాగంలో అయోధ్య బాలరాముని దివ్య స్వరూపాన్ని ప్రతిష్టించారు. ఆలయ గర్భగుడిలో మూలవిరాట్ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామితో పాటు నవహనుమాన్ మూర్తులను ఏర్పాటు చేశారు. ఆలయ ముఖద్వారం ఇరువైపులా ఒకవైపు శివపార్వతులు, మరోవైపు లక్ష్మీనారాయణ మూర్తులను అద్భుతంగా నిర్మించారు. ఈ కార్యక్రమాల్లో హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి, కుషాయిగూడ బజరంగ్ దళ్, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. నిర్మాణ పనులకు సహకరించిన ప్రతి ఒక్కరికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే ప్రతిష్ట పూజ కార్యక్రమాలను విజయవంతం చేయాలని భక్తులను కోరారు. ఈ వివరాలను మంగళవారం కుషాయిగూడ శివాంజనేయ దేవస్థానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు వెల్లడించారు.

# వికలాంగుల పెన్షన్ రూ.6000లకు పెంచాలి

* హామీల అమలుకు ఉద్యమం చేస్తాం
* ఎన్పి ఆర్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్న గారి భుజంగారెడ్డి,ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో షాద్‌నగర్ నియోజకవర్గ సమావేశం స్థానిక యూనివర్సల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం కల్పించలేదని ఆయన విమర్శించారు. మొత్తం రూ.3.24 లక్షల కోట్ల బడ్జెట్‌లో వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం2016 ప్రకారం 5 శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా చర్యలు కనిపించడం లేదన్నారు. వికలాంగులకు అవసరమైన సహాయ పరికరాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు.ఎన్ పి ఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు మాట్లాడుతూ... జిల్లాలో వికలాంగులకు అందాల్సిన సహాయ పరికరాలు, స్వయం ఉపాధి రుణాలు అందడం లేదన్నారు. సంక్షేమ పథకాలలో 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మొఘదటి ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేయగా, మధునాల యాదయ్య, తుంపల్లి రవీందర్, ఏడమా మురళీధర్ రెడ్డి, శంకర్, నెహ్రూ, మనిలా, కుసుమ, జెసిక, గౌసియా తదితరులు సభ్యులుగా ఎంపికయ్యారు.

## విద్యార్థి నాయకుల
# అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్య హక్కుల పై దాడి

* ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్




వలిగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ,ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నేడు జరుగు హలో విద్యార్థి చలో సీఎం ఇంటికి కార్యక్రమానికి తరలి వెళ్లనున్న విద్యార్థులను పోలీసులు తెల్లవారి నుండి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలు విడుదల చేయమంటే అక్రమ అరెస్టు చేసి విద్యార్థి ఉద్యమాన్ని అణిచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వారు అన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోతే విద్యార్థులను,యువత ఏకం చేసి రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయకుండా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర ఈ రాష్ట్ర ప్రభుత్వం చేసిందని వారు మండిపడ్డారు.తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారితో పాటు ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు మారోజు నరసింహ చారి, కార్యదర్శి సుద్దాల సాయికుమార్ లను కూడా అరెస్టు చేశారు.

# చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీలే పునాదులు

* 14వ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు అంగన్వాడీలు పునాదులని 14వ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 14వ వార్డులోని అంగన్వాడి కేంద్రంలో మంగళవారం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్ మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలకు అంగన్వాడీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అంగన్వాడీ కేంద్రాలను గర్భిణీలు చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడి సూపర్వైజర్ శోభారాణి మాట్లాడుతూ వెయ్యి రోజుల ప్రాముఖ్యతను గర్భిణీలు, తల్లులు, బాలింతలకు వివరించారు. పుట్టిన వెంటనే చిన్నారికి మురుపాలు తాపిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కే నిర్మల, ఆయా పుష్ప, చిన్నారులు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# శక్తి, భక్తి, సేవల ప్రతిరూపం శ్రీ ఆంజనేయ స్వామి – మహోత్సవానికి ఆహ్వానం



ప్రజాస్ఫూర్తి, కాప్రా: శక్తి, భక్తి, సేవల ప్రతిరూపమైన శ్రీ ఆంజనేయ స్వామి మనకు మార్గదర్శిగా నిలుస్తారని పేర్కొంటూ, కుషాయిగూడలో నిర్మించిన 54 అడుగుల భారీ శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి ఆహ్వాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ గ్రామ ప్రజలు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి స్వాగతించారు. కుషాయిగూడలో నిర్వహించనున్న మూడు రోజుల మహోత్సవ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్, నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, బొంతు శ్రీదేవి యాదవ్‌లతో కలిసి గ్రామ ప్రజలు మహేష్ కుమార్ గౌడ్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ మహోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## చెక్కుతో పాటు
# తులం బంగారం ఇవ్వాలి

: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




ప్రజాస్ఫూర్తి, కాప్రా: కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం కాప్రా ఎంఆర్ఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెక్కుల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరగాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకాలకు అనుగుణంగా రూ.1,16,000 ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం కూడా అందించాలని అన్నారు. కాప్రా మండలానికి చెందిన మొత్తం 80 మంది లబ్ధిదారులు ఈ పథకాల ద్వారా ప్రయోజనం పొందారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ రాజేష్, డీటీ ప్రవీణ్, ఎంఆర్ఓ కార్యాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి

* కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
* మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ వ్యవసాయాధారిత ప్రాంతమైన భద్రాద్రి జిల్లాలో మొక్కజొన్న సాగు చేసిన రైతులు నష్టపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించిందని తెలిపారు. గిట్టుబాటు ధర కల్పించడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం ఉండకూడదని ఆయన హెచ్చరించారు. తూకంలో తేడాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎరజెండా పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడి పోరాడుతుందని, ప్రభుత్వం నుండి రైతులకు రావాల్సిన ప్రతి పైసాను ఇప్పించే బాధ్యత తమపై ఉందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

# నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 ప్రవేశ పరీక్షను ఎలాంటి లోపాలకు తావు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు కచ్చితంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మే 3వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా




చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 1078 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానుండగా, ఇందుకోసం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సింగరేణి ఉమెన్స్ కళాశాల, శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల, నవభారత్ ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఎదురుగా గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అభ్యర్థులను ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, భద్రతా తనిఖీల దృష్ట్యా అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు పైన తప్పనిసరిగా ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అతికించుకోవాలని, అదనంగా మరో ఫోటోతో పాటు తాజా ఫోటో ఉన్న గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పర్సులు, వాచీలు, బెల్టు, చైన్లు, ఇయర్ రింగ్స్, బ్యాంగిల్స్, రింగులు వంటి వస్తువులు అనుమతించబడవని స్పష్టం చేశారు. అభ్యర్థులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ సీఐ సతీష్, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, కలెక్టరేట్ సూపరింటెంట్ వెంకటేశ్వర్లు, నీట్ పరీక్ష ఇంచార్జ్ ప్రసాద్, పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు, తహశీల్దారులు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మత్తుకు బానిసలై జీవితాలను చిత్తు చేసుకోవద్దు

**– కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: పట్టణ పరిధిలో వివిధ సందర్భాల్లో గంజాయి సేవిస్తూ పట్టుబడిన యువకులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో డిఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో మంగళవారం కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంతోపాటు చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో పలు సందర్భాల్లో గంజాయి సేవిస్తూ పట్టుబడి కేసులలో నమోదైన యువకులను పిలిపించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై యువకులు తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచిగా చదువుకొని తమ తల్లిదండ్రులకు, తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సారధ్యంలో ఇకపై కొత్తగూడెం పట్టణ పరిసర ప్రాంతాల్లో నిరంతరం గస్తీని పెంచి ప్రత్యేక తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా అక్రమంగా గంజాయి సరఫరా చేస్తునట్లు గానీ, సేవిస్తున్నట్లు గానీ సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోపంగా ఉంచుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం టూ టౌన్ సిఐ ప్రతాప్, చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ సిఐ కరుణాకర్, త్రీటౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మొట్టమొదటి గాజు వంతెన హుస్నాబాద్ లో నిర్మాణం

* **పర్యాటకులను ఆకర్షించేలా అత్యాధునిక హంగులతో సుందరీ కరణ**

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : పర్యాటక రంగంలో సరికొత్త ఆవిష్కరణకు హుస్నాబాద్ పట్టణం వేదిక కాబోతుంది.తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటి గాజు వంతెనను హుస్నాబాద్ పట్టణం ఎల్లమ్మ చెరువు లో నిర్మిస్తున్నారు.అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి పర్యాటకులను ఆకర్షించే విధంగా అన్ని రకాల హంగులను తీర్చిదిద్ది త్వరలోనే ప్రజల ముందు రావడానికి ఈ గాజు వంతెన సిద్ధం అవుతుంది.స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో పర్యాటక రంగాన్ని హుస్నాబాద్ ప్రాంతంలో అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ఈ నిర్మాణాన్ని తీసుకొని 18 కోట్ల భారీ వ్యయంతో నిర్మాణం చేపట్టారు.ఈ గాజు వంతెన పర్యాటకులను ఆకర్షించేలా అందమైన లవ్ సింబల్ హృదయ ఆకారంలో నిర్మితమవుతుంది చుట్టూ ప్రకృతి సోయగాలతో అక్కడ వచ్చే ప్రతి పర్యాటకుడు ఆనందకరంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో అద్భుతమైన అనుభూతిని పొందేందుకు దీన్ని రూపొందిస్తున్నారు.గాజు వంతెన పై నడుస్తుంటే కింద నీటిని, పక్కకు ప్రకృతి సోయగాలను ఆస్వాదిస్తూ పర్యాటకులు అనుభూతిని పొందుతారు.ఈ గాజు వంతెనను త్వరలోనే అందుబాటులో తెచ్చేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు.అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి గాజు వంతెన నిర్మాణం అవుతుందని పర్యాటకులను ఆకర్షించే విధంగా చాలా అద్భుతంగా నిర్మాణం చేపడుతున్నామని ఆయన అన్నారు. పర్యాటక రంగంలో సరికొత్త ఆవిష్కరణకు హుస్నాబాద్ పట్టణం వేదిక కాబోతుంది. స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో పర్యాటక రంగాన్ని హుస్నాబాద్ ప్రాంతంలో అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ఈ నిర్మాణాన్ని తీసుకొని 18 కోట్ల భారీ వ్యయంతో నిర్మాణం చేపట్టారు.ఈ గాజు వంతెన పర్యాటకులను ఆకర్షించేలా అందమైన లవ్ సింబల్ హృదయ ఆకారంలో నిర్మితమవుతుంది చుట్టూ ప్రకృతి సోయగాలతో అక్కడ వచ్చే ప్రతి పర్యాటకుడు ఆనందకరంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో అద్భుతమైన అనుభూతిని పొందేందుకు దీన్ని రూపొందిస్తున్నారు.గాజు వంతెన పై నడుస్తుంటే కింద నీటిని, పక్కకు ప్రకృతి సోయగాలను ఆస్వాదిస్తూ పర్యాటకులు అనుభూతిని పొందుతారు.ఈ గాజు వంతెనను త్వరలోనే అందుబాటులో తెచ్చేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు.అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి గాజు వంతెన నిర్మాణం అవుతుందని పర్యాటకులను ఆకర్షించే విధంగా చాలా అద్భుతంగా నిర్మాణం చేపడుతున్నామని ఆయన అన్నారు.

## ఏకధాటిగా చలివేంద్రం నిర్వహించడం ఎంతో ఆత్మ సంతృప్తి



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు, శ్రీ అల్లూరి సీతారామరాజు పేరు మీద నెల రోజులుగా, ఏకధాటిగా చలివేంద్రం నిర్వహించడం ఎంతో ఆత్మ సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోందని, "శ్రీ అల్లూరి సీతారామరాజు యువసేన కమిటీ సభ్యులు" తెలిపారు. సూరారం కాలనీ తెలుగుతల్లి నగర్ లో శ్రీరామనవమి సందర్భంగా 2026 మార్చి 27.న ప్రారంభించిన చలివేంద్రం విజయవంతంగా నెల రోజులు పూర్తి చేసుకుందని, ప్రజలకు వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగించే ఉద్దేశంతో వారంలో రెండు రోజులు మజ్జిగ పంపిణీ కూడా చేస్తున్నట్టు సభ్యులు తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందన గానీ, దాతల సహకారం గానీ ఎనలేనిదని కొనియాడారు. స్థానిక ప్రజలకు కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే రాబోయే రోజుల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడానికి వారు వెనుకాడబోమని, మంచి కార్యక్రమాలు చేపట్టడానికి తాము ఎప్పుడూ ముందుంటామని వారు తెలియజేశారు.

## వైభవంగా కూకట్ పల్లిలో శ్రీ రామాయణ మహా యజ్ఞ కార్యక్రమం



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : కూకట్ పల్లి శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానము లో మంగళవారం శ్రీ గరుడ, హనుమద్ మూర్తి స్థాపన ప్రయుక్త పాంచాంహ్నిక అష్ట కుండాత్మక శ్రీ రామాయణ మహా యజ్ఞ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన నారసింహ ఇష్టి, నారసింహ మండల పూజ కార్యక్రమములో కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ శ్రీనివాసరావు (తులసి రావు) దంపతుల తో కలిసి పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు దంపతులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయి లో పర్యవేక్షణ చేయాలి

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లో పెట్రోల్, డీజిల్ సరఫరా పరిస్థితి పై క్షేత్రస్థాయి లో అధికారులు పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో సంబంధిత శాఖల అధికారులతో పెట్రోల్, డీజిల్ సరఫరా పరిస్థితి పై సమీక్ష నిర్వహించారు. ప్రజలు అపోహ లకు లోను కాకుండా, అవసరానికి సరిపడేంత మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లా లోని అన్ని పెట్రోల్ బంకుల్లో తహసీల్దార్, సివిల్ సప్లై, పోలీస్, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి నిల్వలను పరిశీలించాలని ఆదేశించారు. ఇంధనం ఉన్నప్పటికీ "స్టాక్ లేదు" బోర్డులు పెట్టిన బంక్ యజమానుల పై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పెట్రోల్ బంకుల్లో సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎక్కడైనా ఇంధన కొరత ఉంటే 1800 425 00 333 టోల్ ఫ్రీ నంబర్ లేదా రాష్ట్ర విపత్తుల హెల్ప్‌లైన్ 1077కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు ముందు స్తుగా క్యాన్లలో అధిక పరిమాణం లో పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకో వద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోం, ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులు, పెట్రోల్ బంక్ డీలర్లు పాల్గొన్నారు.

## బీసీ కులగణనపై కేంద్రం స్పష్టత ఇవ్వకపోతే ప్రధాని పర్యటనను అడ్డుకుంటాం

* **జాతి జనగణనలో బీసీ కుటుంబాలను ఎందుకు లెక్కించడం లేదు .**
* **బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : బీసీ కులగణనపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా జాతీయ జన గణనలో దేశ ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు ఇవ్వడం బీసీలను నమ్మించి మోసం చేయడమేననీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు మంగళవారం నల్లగొండలోని బీసీ నాయకులు సుంకరి మల్లేష్ గౌడ్ నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఏప్రిల్ 30 2025 రోజున ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్లో ఈ దప జరిగే జాతి జనగణనలో సమగ్ర కులగననా చేపడతామని నిర్ణయం తీసుకొని తీరా నిన్నటి నుండి జరుగుతున్న జాతి జనగణనలో బీసీ కుటుంబాలను లెక్కించకుండా కేంద్రం బీసీలను పచ్చి మోసం చేస్తుందని ఆయన ఆరోపించారు కేంద్ర ప్రభుత్వం 33 ప్రశ్నలతో ప్రశ్నావళిని రూపొందించి 34వ ప్రశ్నగా బీసీ కుటుంబాలను ఎందుకు చేర్చలేదని ఆయన ప్రశ్నించారు బీసీ కులాలను లెక్కించకుండా జాతి జన గణన ఎన్నిసార్లు చేపట్టిన బీసీలకు ఒరిగేది ఏమీ లేదని బీసీలకు ప్రయోజనం లేని జాతి జనగణన ఎవరికోసమని ఆయన ప్రశ్నించారు బీసీ కులగణనపై బిజెపి సమాధానం ఇవ్వకుంటే మే 10వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టబోయే తెలంగాణ పర్యటనను అడ్డుకుంటామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. మహిళా బిల్లు అడ్డుకునేవారు మహిళా ద్రోహులు అంటున్న బిజెపి బీసీ మహిళలకు సబ్ కోట కల్పిస్తామని ఎందుకు అనడం లేదని ఆయన ప్రశ్నించారు. మహిళ ఆగ్రహ సభలు నిర్వహిస్తున్న బిజెపి ఏ మహిళల ప్రయోజనాల కోసం ఈ బిల్లు తీసుకువస్తుందో సమాజానికి తెలుసని, దేశంలోని 40కోట్ల మంది బీసీ మహిళల ఆకాంక్షలను గౌరవించకుండా కేవలం 10 శాతం ఉన్న మహిళల కోసం మహిళా బిల్లు తీసుకువస్తే సహించేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు ఈ సమావేశంలో సుంకర మల్లేష్ గౌడ్, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్, సాయిబాబా ముదిరాజ్, గూడూరు భాస్కర్, జెల్లా ఆదినారాయణ, నల్ల మధు యాదవ్ బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు హరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులు, డీలర్లు, సంబంధిత అధికారులతో సమావేశం

మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మహబూబాబాద్ జిల్లా హెచ్పిసిఎల్, బిపిసిఎల్, ఐఓసిఎల్ కంపెనీ ప్రతినిధులు, పెట్రోల్, డీజిల్ డీలర్లతో అదనపు కలెక్టర్ అనిల్ కుమార్, సంబంధిత అధికారులతో కలిసి డీజిల్, పెట్రోల్ కొరతపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా డీజిల్ ,పెట్రోల్ ,గ్యాస్ ఆయిల్ (ఇంధనాలను) అందించాలని, ప్రస్తుత డిమాండ్ కనుగుణంగా లభ్యతను స్వీకరించి సరఫరా చేయుటలో వేగం పెంచాలని సూచించారు, కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే చర్యలు తీసుకుంటామని, అధిక ప్రాధాన్యత వ్యవసాయ ఆధారిత వాహనాలు హార్వెస్టింగ్, ట్రాక్టర్ తదితర వాటికి ప్రాముఖ్యత కల్పించి ఇంధనాలు అందించాలని, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు కంపెనీ ప్రతినిధులు డీలర్లతో నిత్యం మాట్లాడుతూ సమస్యలు రాకుండా ఉత్పత్తులను అందించాలని ఆదేశించారు, పెట్రోల్ బంకులలో డబ్బాలలో డీజిల్ పెట్రోల్ తీసుకు వెళ్లడం రాదని, అవసరం లేకున్నా అధికంగా వినియోగించరాదని, సూచించారు. ప్రభుత్వం అత్యంత వేగంగా డీజిల్, పెట్రోల్ సరఫరాకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు, పెట్రోల్ పంపుల వద్ద ఎలాంటి ఆందోళన పరిస్థితులు లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పెట్రోల్ పంపు యజమానులకు సూచించారు, ఈ సమావేశంలో పౌర సరఫరా శాఖ అధికారి రమేష్, ఆయిల్ కంపెనీ సెల్స్ ప్రతినిధులు ప్రణీత్, సౌమ్యదీప్, హరీష్ రాజ్, పెట్రోల్, డీజిల్, డీలర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లాలో పెట్రోల్ బంకుల వ్యవహారం కలకలం

* **నో స్టాక్ బోర్డులతో కాలయాపన... అధికారుల తనిఖీలు ఎక్కడ?**
* **డీజిల్ పెట్రోల్ లేదని ఇంత పానిక్ చెందుతున్న ప్రజలకు భరోసా ఎక్కడ???**



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : వికారాబాద్ జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో పెట్రోల్, డీజిల్ సరఫరాపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధనం అందుబాటులో ఉన్నప్పటికీ, "నో స్టాక్" బోర్డులు ఏర్పాటు చేసి వినియోగదారులను వెనక్కి పంపిన ఘటనలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఒకేరోజు జిల్లాలో అనేక ప్రాంతాల్లో అకస్మాత్తుగా పెట్రోల్, డీజిల్ అయిపోయిందన్న ప్రచారం ప్రజల్లో ఆందోళన కలిగించింది. అయితే కొన్ని బంకుల్లో నిల్వలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచాలనే ఉద్దేశంతో ఇలా వ్యవహరించారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సోషల్ మీడియాలో ఈ అంశం పెద్ద ఎత్తున వైరల్ అయినప్పటికీ, తహశీల్దార్‌లు కానీ, రెవెన్యూ అధికారులు కానీ ఒక్క బంక్‌ను కూడా తనిఖీ చేయలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు*. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఇంధన సేవలు ఇలా నిలిచిపోవడం వెనుక అసలు కారణాలేమిటో వెలికి తీయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిల్వలు - విక్రయాలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు*. అధికారులు ఇప్పటికైనా స్పందించి నిజానిజాలు బయటపెడతారా లేదా అన్నది వేచి చూడాలి. జిల్లాలో ఏం నడుస్తుంది కూడా తెలుసుకొని పాలన అధికారులు ఎక్కడ?

## ద్విచక్ర వాహనం లో చెలరేగిన మంటలు



జనగామ, ప్రజాస్ఫూర్తి, ఏప్రిల్ 28 : పట్టణం లోని గణేష్ వాడ లో మంగళవారం ఉదయం పాల వ్యాపారి ద్విచక్ర వాహనం లో చెలరేగిన మంటలు. వివరాల లోకి వెళ్తే పడమటి గూడెం (నిండిగొండ) గ్రామానికి చెందిన దర్మేందర్ రెడ్డి అనే పాల వ్యాపారి పల్సర్ వాహనం పై రోజువారీ దినచర్య లో భాగంగా వ్యాపార నిమిత్తం కాలనీ లోని ఓ ఇంటి ముందు ఆపి పాలు పోయడానికి ఇంట్లోకి వెళ్లి తిరిగి వచ్చేసరికి వాహనంలో మంటలు చేలరేగి కాలిపోవడం జరిగింది. సంఘటన ను గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. మంటల కారణంగా వాహనాని నష్టపోయిన అతను కన్నీటి పర్యంతం అయ్యాడు.

## గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

* **ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

భువనగిరి ప్రజాస్ఫూర్తి : భువనగిరి పట్టణ కేంద్రంలోని మద్ది నర్సింహారెడ్డి గార్డెన్ లో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం 9 వ వార్షికోత్సవ మహాసభ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు . ఏరియా ఆస్పత్రి నుంచి మద్ది నర్సింహారెడ్డి గార్డెన్ వరకు సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులు ఆడపిల్ల అమ్మ ను కాపాడుకుందాం అనే నినాదంతో భారీ ర్యాలీ నిర్వహించారు . వార్షికోత్సవ మహాసభకి సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు అంబటి చెన్న కిష్టయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. లక్ష్మయ్య అధ్యక్షత వహించారు . జ్యోతి ప్రజ్వలన చేసి 9వార్షికోత్సవ మహాసభను ప్రారంభించారు . సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు జిల్లా అధ్యక్షులు కిష్టయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ ము 428 జీవో 30వేల మందికి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వంలో 428 జీవోను 429గా మార్చి ట్రైనింగ్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాంగ్రెస్ గవర్నమెంట్ అయినా ఆర్ఎంపీలను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతంలో 24 గంటల పాటు వైద్యం అందిస్తున్న మమ్మల్ని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వేధిస్తున్నారని వాపోయారు. తక్షణమే ఆర్ఎంపీలకు పీఎంపీలకు రాష్ట్ర ప్రభుత్వం చేత గుర్తింపు కార్డులు అందజేయాలని , తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వేధింపులు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు . మీ యొక్క సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి తొందర్లోనే మీకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇచ్చే విధంగా కృషి చేస్తానని మరియు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తమ సమస్యలను వినిపించేందుకు ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం పి , పి ఎం పి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ నేతి రాజేశ్వరరావు , సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పోనుగోటి హనుమంతరావు , సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రాజు , జిల్లా గౌరవ అధ్యక్షులు కాటేపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల లక్ష్మయ్య గౌడ్ , జిల్లా కోశాధికారి రాంచందర్ , జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రొయ్యల శంకర్ , జిల్లా ఉపాధ్యక్షులు వంగ శ్రీనివాస్ , జిల్లా గౌరవ సలహాదారులు నల్లమాస విశ్వనాథం , రాష్ట్ర ఈ సి మెంబర్ మురహరి , జిల్లా ఉపాధ్యక్షురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ వైఫల్యంపై 'యశోధ' వైద్యుల విజయం

* **అత్యాధునిక వైద్యంతో కోలుకున్న మహిళ**
* **నెఫ్రాలజిస్ట్ డాక్టర్ చేతన్ వీరమనేని**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మలక్ పేట యశోధ ఆసుపత్రి వరప్రదాయినిగా మారుతోందని యశోధ హాస్పిటల్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ చేతన్ వీరమనేని అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి హోటల్ హైవే 9 లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు వీరమనేని చేతన్ మాట్లాడుతూ కిడ్నీ పనితీరు మందగించిన వారు బయాప్సీ పరీక్షల ద్వారా ఖచ్చితమైన కారణాలు తెలుసుకోవచ్చన్నారు. ఇటీవల గుర్రంపోడుకు చెందిన మహిళ శరీరమంతా వాపులతో నల్లగొండలోని ఓ ఆసుపత్రికి రాగా, ఆమెను పరీక్షించి, అత్యవసరంగా రీనల్ బయాప్సీ అవసరం అని తెలియజెప్పామన్నారు. రెండు మూడు రోజులు అనంతరం అర్థం చేసుకున్న ఆ మహిళ కుటుంబ సభ్యులతో కలిసి మలక్పేట యశోద ఆసుపత్రికి రావడం జరిగిందన్నారు. హిస్టోపాథాలజీ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించినట్లు తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. కిడ్నీ వ్యాధి నిర్ధారణలో 'రియల్ టైమ్ అల్ట్రా సౌండ్ గైడెడ్ రీనల్ బయాప్సీ' అత్యంత కీలకమని, ఈ సౌకర్యం తమ వద్ద అందుబాటులో ఉందని వివరించారు. అనంతరం శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ రోగి సంక్షేమమే ధ్యేయంగా తమ ఆసుపత్రి పనిచేస్తుందన్నారు. ఆసుపత్రి కి వచ్చిన రోగికి అవసరమైన చికిత్సలు మాత్రమే చేస్తామని, క్లిష్ట పరిస్థితుల్లోనూ నిపుణులైన వైద్య బృందం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, రోగుల ప్రాణాలు కాపాడుతోందన్నారు.

## నాలుగు లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాలి




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: చికాగో అమరవీరులు చిందించిన రక్తం ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను, ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలని పోరాడదామని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ )మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. మహబూబాబాద్ లోని మాస్ లైన్ పార్టీ ఆఫీస్ వద్ద 140 వ మేడే గోడ పత్రికను మంగళవారం ఆవిష్కరించడం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగకార్మికుల పోరాటాన్ని అమరత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేడు కార్మిక వర్గంపై ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న పని భారానికి పని గంటల పెంపుకు శ్రమదోపిడికి వ్యతిరేకంగా నేడు కార్మిక వర్గం ఉద్యమించాలని ఆయన పిలుపునివ్వడం జరిగింది.నరేంద్ర మోడీ తీసుకొచ్చినటువంటి నాలుగు లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా కార్మిక వర్గం మేడే అమరవీరుల స్ఫూర్తితో పోరాటాల నిర్వహించాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో టి యు సి ఐ నాయకులు ఉప్పలయ్య, సూరయ్య, రమేష్, రవి, బాలు, వెంకన్న, బాలాజీ, సునీత తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రంలో మొట్టమొదటి గాజు వంతెన హుస్నాబాద్ లో నిర్మాణం

- పర్యాటకులను ఆకర్షించేలా అత్యాధునిక హంగులతో సుందరీ కరణ



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : పర్యాటక రంగంలో సరికొత్త ఆవిష్కరణకు హుస్నాబాద్ పట్టణం వేదిక కాబోతుంది.తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటి గాజు వంతెనను హుస్నాబాద్ పట్టణం ఎల్లమ్మ చెరువు లో నిర్మిస్తున్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి పర్యాటకులను ఆకర్షించే విధంగా అన్ని రకాల హంగులను తీర్చిదిద్ది త్వరలోనే ప్రజల ముందు రావడానికి ఈ గాజు వంతెన సిద్ధం అవుతుంది. స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో పర్యాటక రంగాన్ని హుస్నాబాద్ ప్రాంతంలో అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ఈ నిర్ణయాన్ని తీసుకొని 18 కోట్ల భారీ వ్యయంతో నిర్మాణం చేపట్టారు.ఈ గాజు వంతెన పర్యాటకులను ఆకర్షించేలా అందమైన లవ్ సింబల్ హృదయ ఆకారంలో నిర్మితమవుతుంది చుట్టూ ప్రకృతి సోయగాలతో అక్కడ వచ్చే ప్రతి పర్యాటకుడు ఆనందకరంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో అద్భుతమైన అనుభూతిని పొందేందుకు దీన్ని రూపొందిస్తున్నారు.గాజు వంతెన పై నడుస్తుంటే కింద నీటిని, పక్కకు ప్రకృతి సోయగాలను ఆస్వాదిస్తూ పర్యాటకులు అనుభూతిని పొందుతారు.ఈ గాజు వంతెనను త్వరలోనే అందుబాటులో తెచ్చేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు.అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి గాజు వంతెన నిర్మాణం అవుతుందని పర్యాటకులను ఆకర్షించే విధంగా చాలా అద్భుతంగా నిర్మాణం చేపడుతున్నామని ఆయన అన్నారు. పర్యాటక రంగంలో సరికొత్త ఆవిష్కరణకు హుస్నాబాద్ పట్టణం వేదిక కాబోతుంది. స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో పర్యాటక రంగాన్ని హుస్నాబాద్ ప్రాంతంలో అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ఈ నిర్ణయాన్ని తీసుకొని 18 కోట్ల భారీ వ్యయంతో నిర్మాణం చేపట్టారు.ఈ గాజు వంతెన పర్యాటకులను ఆకర్షించేలా అందమైన లవ్ సింబల్ హృదయ ఆకారంలో నిర్మితమవుతుంది చుట్టూ ప్రకృతి సోయగాలతో అక్కడ వచ్చే ప్రతి పర్యాటకుడు ఆనందకరంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో అద్భుతమైన అనుభూతిని పొందేందుకు దీన్ని రూపొందిస్తున్నారు.గాజు వంతెన పై నడుస్తుంటే కింద నీటిని, పక్కకు ప్రకృతి సోయగాలను ఆస్వాదిస్తూ పర్యాటకులు అనుభూతిని పొందుతారు.ఈ గాజు వంతెనను త్వరలోనే అందుబాటులో తెచ్చేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు.అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి గాజు వంతెన నిర్మాణం అవుతుందని పర్యాటకులను ఆకర్షించే విధంగా చాలా అద్భుతంగా నిర్మాణం చేపడుతున్నామని ఆయన అన్నారు.

## బెంగాల్, అసోం, పుదుచ్చేరిలలో అధికారంలోకి రాబోతున్నాం: రామచందర్ రావు

- భవిష్యత్తులో తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామని ధీమా
- మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక మొదటిసారి హైదరాబాద్ వస్తున్నారని వెల్లడి
- మోదీ రాకతో తెలంగాణలో రాజకీయ మార్పు ప్రారంభమవుతుందన్న రామచందర్ రావు



హైదరాబాద్: పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరిలలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అధికారంలోకి రాబోతుందని, భవిష్యత్తులో తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అగ్రనేతలు సన్నాహక సమావేశం నిర్వహించారు. బహిరంగ సభ ఏర్పాట్లు, జన సమీకరణ అంశాలపై చర్చించారు. సైబరాబాద్, హైదరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్ల నుంచి జన సమీకరణ అంశాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ, మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక మొదటిసారి హైదరాబాద్ వస్తున్నారని తెలిపారు. మోదీ రాకతో రాజకీయ మార్పు ప్రారంభమవుతుందని అన్నారు.

## హైదరాబాద్‌లో హిమపాతం.. ఓఆర్ఆర్‌పై కశ్మీర్‌ను తలపించిన దృశ్యాలు!

- హైదరాబాద్ శివార్లలో కురిసిన భారీ వడగళ్ల వాన
- శంషాబాద్-నాదర్‌గుల్ మధ్య ఓఆర్ఆర్‌పై మంచు దృశ్యాలు
- రోడ్లపై పేరుకుపోయిన మంచుతో ఆడుకున్న జనం
- ఫొటోలు, రీల్స్‌తో సోషల్ మీడియాలో సందడి
- భాగ్యనగరం కశ్మీర్‌లా మారిందంటూ నెటిజన్ల కామెంట్లు




హైదరాబాద్, ఏప్రిల్ 28: ఏప్రిల్ నెలలో ఎండలతో అల్లాడే భాగ్యనగరంలో ఒక్కసారిగా హిమాలయాలు ఆవిష్కృతమయ్యాయి. కశ్మీర్‌లోని మంచు వీధులను తలపించే దృశ్యాలు హైదరాబాద్ నగర రోడ్లపై దర్శనమిచ్చాయి. నిన్న సాయంత్రం నగరంలో కురిసిన భారీ వడగళ్ల వాన, ఊహించని అద్భుతానికి కారణమైంది. ముఖ్యంగా శంషాబాద్ నాదర్‌గుల్ మధ్య ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై ప్రకృతి సృష్టించిన ఈ వింతకు నగరవాసులు అబ్బురపడ్డారు. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఓఆర్ఆర్, తెల్లని మంచు దుప్పటి కప్పుకొని యూరప్‌లోని శీతాకాలపు అందాలను గుర్తుచేసింది. సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అయితే, శివారు ప్రాంతాల్లో ఈ వర్షం కాస్తా వడగళ్ల తుపానుగా మారింది. ముఖ్యంగా ఓఆర్ఆర్‌పై కుండపోతగా కురిసిన వడగళ్ల కారణంగా, కొద్ది నిమిషాల్లోనే రోడ్డుకు ఇరువైపులా అంగుళాల మందం మేర మంచు పేరుకుపోయింది. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు, ఈ అనూహ్య దృశ్యాన్ని చూసి తమ కళ్లను తామే నమ్మలేకపోయారు. వాహనాలను పక్కకు ఆపి మరీ మంచుతో ఆడుకుంటూ, ఒకరిపై ఒకరు మంచు గడ్డలను విసురుకుంటూ సరదాగా గడిపారు. ఈ అరుదైన వాతావరణాన్ని తమ కెమెరాల్లో బంధించేందుకు యువత పోటీపడింది. రోడ్డుపై పేరుకుపోయిన మంచు కుప్పల వద్ద నిలబడి ఫొటోలు, వీడియోలు, రీల్స్ తీస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో క్షణాల్లోనే ఈ దృశ్యాలు వైరల్ అయ్యాయి. 'హైదరాబాద్ హిమాలయాలు', 'ఓఆర్ఆర్ కశ్మీర్' వంటి హ్యాష్‌ట్యాగ్‌లతో నెటిజన్లు తమ ఆనందాన్ని పంచుకున్నారు. "ఇక యూరప్ వెళ్లక్కర్లేదు, మన ఓఆర్ఆర్‌కి వెళితే చాలు" అంటూ సరదా కామెంట్లు పెట్టారు. అయితే, రోడ్డుపై మంచు గడ్డల కారణంగా వాహనాలు జారిపోయే ప్రమాదం ఉందని గ్రహించిన పోలీసులు, వెంటనే అప్రమత్తమై వాహనదారులకు సూచనలు జారీ చేశారు. ఏదేమైనా మండే ఎండల నుంచి ఈ వడగళ్ల వాన నగరవాసులకు గొప్ప ఊరటనివ్వడంతో పాటు జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతిని మిగిల్చింది.

## కూతురు అడిగే ప్రశ్నలకు కేసీఆర్ సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు: మహేశ్ కుమార్ గౌడ్

- కేసీఆర్ కుటుంబం సొంత వివాదాలతో సతమతమవుతోందన్న టీపీసీసీ చీఫ్
- కేసీఆర్ కుటుంబం పదవుల కోసం పాకులాడుతోందని విమర్శ
- ప్రజలు బీఆర్ఎస్‌ను విశ్వసించడం లేదన్న మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్: పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్, నేడు తన కూతురు కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కేసీఆర్ కుటుంబం సొంత వివాదాలతో సతమతమవుతోందని, వారు ప్రజల సమస్యలపై కాకుండా కేవలం పదవుల కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు పదేళ్ల పాటు బీఆర్ఎస్‌ను ఆదరించారని, కానీ ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదని ఆయన అన్నారు. ఇప్పుడు ప్రజలు బీఆర్ఎస్‌ను విశ్వసించడం లేదని అన్నారు. బీఆర్ఎస్‌కు ఇక భవిష్యత్తు లేదని జోస్యం చెప్పారు. రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని, ఈ క్రెడిట్ అంతా సోనియా గాంధీకే దక్కుతుందని అన్నారు. తెలంగాణ కోసం సోనియా గాంధీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే, కేసీఆర్ తన పాలనతో రాష్ట్రాన్ని 50 ఏళ్లు వెనక్కి నెట్టారని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలోని స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో రాజ్యాంగ విలువల రక్షణకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## హైదరాబాద్ నుంచి ముంబైకి హైస్పీడ్ రైలు.. 3 గంటల్లోనే ప్రయాణం!

- హైదరాబాద్-ముంబై హైస్పీడ్ రైలు ప్రాజెక్ట్ డీపీఆర్ పూర్తి
- గంటకు 330 కి.మీ. వేగంతో ప్రయాణం.. 3 గంటల్లోనే గమ్యం
- వికారాబాద్ వద్ద 4.6 కిలోమీటర్ల భారీ టన్నెల్ నిర్మాణం
- చెన్నై, బెంగళూరు కారిడార్లపైనా మంత్రి కోమటిరెడ్డి సమీక్ష



హైదరాబాద్: తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబైకి ప్రయాణించే వారికి శుభవార్త. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న హైదరాబాద్ పుణె ముంబై హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) పనులు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు వేగవంతం కానున్నాయని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. తాజాగా అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ హైస్పీడ్ రైలు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి ముంబైకి కేవలం మూడు గంటలలోపే చేరుకోవచ్చని మంత్రి తెలిపారు. గంటకు గరిష్ఠంగా 330 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఈ రైళ్లను డిజైన్ చేశారు. మొత్తం 761 కిలోమీటర్ల పొడవైన ఈ కారిడార్‌లో 12 స్టేషన్లు ఉంటాయని, అవసరాన్ని బట్టి ఎలివేటెడ్, అండర్‌గ్రౌండ్ మార్గాల్లో నిర్మాణం చేపడతామని వివరించారు. ముఖ్యంగా వికారాబాద్ సమీపంలో 4.6 కిలోమీటర్ల పొడవైన భారీ టన్నెల్ నిర్మించనుండటం ఈ ప్రాజెక్టులో ఒక ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కేవలం రవాణా సౌకర్యమే కాదని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ఎకనామిక్ గ్రోత్ కారిడార్‌గా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమీక్షలోనే హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు నగరాలకు ప్రతిపాదించిన ఇతర హైస్పీడ్ కారిడార్లపైనా మంత్రి చర్చించారు. అమరావతి మీదుగా వెళ్లే చెన్నై కారిడార్ విషయంలో ఏపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. అలాగే మన్ననూర్, సోమశిల మీదుగా వెళ్లే బెంగళూరు కారిడార్ అలైన్‌మెంట్ ప్లాన్‌లను కూడా పరిశీలించారు. ఈ భారీ ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి కీలక విధాన నిర్ణయాలు తీసుకుంటామని కోమటిరెడ్డి హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సమన్వయంతో పనిచేసి, ప్రాజెక్టులను నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.



## లొంగిపోయిన మావోయిస్టులకు ప్రత్యేక డ్రెస్సులు, ఉద్యోగాలు

- లొంగిపోయిన మావోలను ప్రధాన స్రవంతిలోకి!
- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- లొంగిపోయిన మావోలకు టూరిజం గైడ్స్ గా ఉద్యోగాలు
- కాసేపట్లో నియామకపత్రాలను అందించనున్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్: సమాజానికి దూరంగా అడవుల్లో గడిపిన మాజీ మావోయిస్టులను ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లొంగిపోయిన 20 మంది మాజీ మావోయిస్టులను టూరిజం గైడ్స్ గా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది.ముఖ్యంగా భద్రాచలం, ములుగు వంటి అటవీ ప్రాంతాల్లోని భౌగోళిక పరిస్థితులపై వారికి ఉన్న పట్టును ప్రభుత్వం నిర్మాణాత్మకంగా వాడుకోవాలని నిర్ణయించింది. అడవి మార్గాలు, అక్కడి విశేషాల గురించి వారికి ఉన్న లోతైన అవగాహన పర్యాటకులకు ఎంతో మేలు చేస్తుంది. ఈ ఉద్యోగాల కోసం వీరికి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ), పర్యాటక శాఖ సంయుక్తంగా నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీరికి ప్రత్యేక యూనిఫామ్ కూడా కేటాయించనున్నారు. పునరావాసం అంటే కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా, ఇలా వారి నైపుణ్యానికి తగిన గౌరవప్రదమైన ఉపాధిని కల్పించడం అనేది ఇతర మావోయిస్టులను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి కాసేపట్లో వీరికి నియామకపత్రాలను అందించనున్నారు.

## దయచేసి వ్యక్తిగతంగా చొరవ తీసుకోండి: రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ

- చర్లపల్లి రైల్వే టెర్మినల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మౌలిక సదుపాయాలపై లేఖ
- గతంలోను ముఖ్యమంత్రికి లేఖ రాశానన్న కిషన్ రెడ్డి
- అయినప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించడం లేదన్న కేంద్రమంత్రి



హైదరాబాద్, ఏప్రిల్ 28: చర్లపల్లి నూతన రైల్వే టెర్మినల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మౌలిక సదుపాయాలకు సంబంధించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ పనుల నిమిత్తం గతంలో పలుమార్లు లేఖలు రాసినా అధికారుల నుంచి క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. "దయచేసి ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఆయా రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులను పూర్తి చేయాలి" అని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా, ప్రయాణికుల రాకపోకల మూలంగా నగరంలోని మూడు ప్రధాన రైల్వే స్టేషన్లు సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్ టెర్మినళ్లపై అధిక భారం పడుతోందని గుర్తు చేశారు. ఈ సమస్యకు పరిష్కారంగానే చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద రూ.430 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో కొత్త టెర్మినల్‌ను కేంద్రం అభివృద్ధి చేసిందని అన్నారు. గత సంవత్సరం ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ టెర్మినల్ నుంచి పదుల సంఖ్యలో రైళ్లు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. రోజురోజుకు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నందున రైల్వే స్టేషన్‌కు వెలుపల అప్రోచ్ రోడ్లను విస్తరించాల్సి ఉందని అన్నారు. స్టేషన్‌కు ఇరువైపులా పార్కింగ్ తదితర అవసరాల కోసం కూడా భూసేకరణ చేయాల్సి ఉందని తెలిపారు. చర్లపల్లి స్టేషన్ నుంచి ఎఫ్‌సీఐ గోడౌన్‌కు 200 అడుగుల వెడల్పుతో, భరత్ నగర్, ఈసీ నగర్‌ల వైపు 100 అడుగుల చొప్పున వెడల్పుతో రోడ్లను విస్తరించాలని కోరారు. చర్లపల్లి టెర్మినల్‌కు నీటి సరఫరా కనెక్షన్‌ను ఏర్పాటు చేయడానికి రైల్వే శాఖ రూ.4 కోట్లు జమ చేసిందని, ఈ నీటి కనెక్షన్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. భవిష్యత్తు రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక సౌకర్యాలతో పునరాభివృద్ధి చేస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ స్టేషన్ వద్ద ఆల్ఫా హోటల్ నుంచి రేతిఫైల్ బస్ స్టేషన్ వరకు ఉన్న రహదారిని 120 అడుగుల వెడల్పుతో విస్తరించాల్సి ఉందని అన్నారు. ఈ అభివృద్ధి పనుల కోసం రైల్వే శాఖ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నివేదించామని అన్నారు. ఈ పెండింగ్ పనులకు సంబంధించి 2022, 2023 సంవత్సరాలలో నాటి ముఖ్యమంత్రికి రెండుసార్లు లేఖలు రాశానని గుర్తు చేశారు. 2024లో మీకు కూడా లేఖ రాశానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అయినా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదని అన్నారు. తాను ఉత్తరం రాసిన తర్వాత మీరు పనులు ప్రారంభించాలని ఆదేశించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ పనులను పూర్తి చేయాలని తన లేఖలో కిషన్ రెడ్డి కోరారు.

# నువ్వు 'సింగం' అయితే.. నేను 'పుష్ప': ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌కు టీఎంసీ నేత కౌంటర్

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఈ క్రమంలో దక్షిణ 24 పరగణాలు జిల్లాలోని ఫాల్టా నియోజకవర్గంలో కొన్నిచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన నేతలను, కార్యకర్తలను పోలింగ్ విధుల్లో ఉన్న ఓ ఐపీఎస్ అధికారి బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ ఆ పార్టీ నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐపీఎస్ అధికారి 'సింగం' అయితే..తాను 'పుష్ప' అని కౌంటర్ ఇచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్ అజయ్ పాల్ శర్మ 2011 బ్యాచ్ అధికారి. ఆయనకు ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా పేరుంది. స్థానికంగా ఆయన్ను పోలీస్ సింగంగా పిలుస్తుంటారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈసీ నియమించిన 95 మంది ప్రత్యేక పరిశీలకుల్లో ఈయన ఒకరు. దక్షిణ 24 పరగణాలు జిల్లాలో ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక ఓటర్ల నుంచి కొందరు ఓటరు కార్డులు సేకరిస్తున్నారని, ఓటర్లను బెదిరిస్తున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. దీంతో ఆయా ప్రాంతాల్లో పర్యటించిన ఐపీఎస్ అజయ్ శర్మ.. ఎవరైనా ఓటర్లను బెదిరిస్తే





చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ పరిణామాలపై స్థానిక టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ స్పందిస్తూ.. ఓటర్లను బెదిరింపులకు గురిచేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. ఇటీవల ఓ అర్ధరాత్రి సమయంలో ఐపీఎస్ అధికారి తన ఇంటికి వచ్చి హెచ్చరికలు చేశారని అన్నారు. ఒకవేళ ఆయన సింగం (ఐపీఎస్ అజయ్ పాల్ శర్మ) అయితే, తాను పుష్ప అంటూ సినిమా డైలాగ్‌లను విసిరారు. బలగాలను వెంటపెట్టుకొని వచ్చి తన మద్దతుదారులపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు.


## ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు తావులేదు

**: రాజ్‌నాథ్ సింగ్**




ఉగ్రవాదంపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. కిర్గిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (SCO) రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా గతేడాది జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. ఈ ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందన్నారు. దీని అనంతరం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి.. ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందన్నారు. ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఈసందర్భంగా పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా.. ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్రదాడులను అస్సలు విస్మరించకూడదని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదన్నారు. ఉగ్రవాదులకు సాయపడుతూ, ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీఓ వెనకాడకూడదని ఆయన పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ప్రస్తుతం కొనసాగుతోన్న సంక్షోభం గురించి కూడా ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జరిగిన వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూడా వాటిల్లిందన్నారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈక్రమంలో ఉద్రిక్తతల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలన్నారు.

## పోలింగ్ వేళ 'బాంబులు' లేకుండా చూడండి NIAకు ఈసీ విజ్ఞప్తి




పశ్చిమ బెంగాల్‌లో బుధవారం జరగనున్న రెండో దశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం (Election Commission) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా భద్రతను మోహరించింది. అయితే, పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు రాష్ట్రంలో నాటుబాంబులు లభించడం, స్వల్ప పేలుడు ఘటనల నేపథ్యంలో ఈసీ అప్రమత్తమైంది. కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం, ఓటింగ్‌కు అంతరాయం కలిగించేందుకు దుండగులు బాంబులను ఉపయోగించే ప్రమాదం ఉందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని జాతీయ దర్యాప్తు సంస్థ (NIA)కు సూచించింది. రాష్ట్రంలో పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. దక్షిణ పరగణాలు జిల్లాలోని భాంగర్ ప్రాంతంలో ఇటీవల ఓ ఇంట్లో అనేక నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఎన్ఐఏ, ముమ్మర దర్యాప్తు చేపట్టింది. ఇదిలాఉంటే, రాష్ట్రంలో మొత్తం 294 శాసనసభ స్థానాలకు గాను 152 చోట్ల తొలి దశలో ఈ నెల 23న పోలింగ్ పూర్తైంది. మిగిలిన 142 స్థానాల్లో బుధవారం రెండో దశ పోలింగ్ జరగనుంది. ఈ 142 స్థానాల్లో గత ఎన్నికల్లో టీఎంసీనే 123 చోట్ల విజయం సాధించగా.. భాజపా 18, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ ఒకచోట గెలిచాయి.

## ఎన్ని అడ్డంకులు వచ్చినా.. మహిళా రిజర్వేషన్ అమలు చేస్తాం: మోదీ




పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టడానికి తాము ఎంతగానో ప్రయత్నించామని ప్రధాని నరేంద్ర మోదీ (PM Narendra Modi) అన్నారు. కాంగ్రెస్, ఎస్పీ వంటి ప్రతిపక్ష పార్టీల నీచ రాజకీయాల వల్లే ఆ చట్టం అమల్లోకి రాకుండా ఆగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు అభివృద్ధి చెందడం, అసెంబ్లీలు, పార్లమెంట్‌లకు రావడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని..అందువల్లే 40 ఏళ్లుగా ఈ బిల్లును అడ్డుకుంటూనే ఉన్నారని అన్నారు. తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారు. వారణాసిలో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడమనే మహా యజ్ఞం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నానని.. అందుకు మాతృమూర్తుల ఆశీస్సులు తీసుకునేందుకు వారణాసి వచ్చానని ప్రధాని పేర్కొన్నారు. ఈ బిల్లును తేవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని..ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదని అన్నారు. సాధారణ కుటుంబాల మహిళలు పార్లమెంటు, అసెంబ్లీలకు రావాలని కోరుకున్నానని తెలిపారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం అధికారం తమ కుటుంబాలకే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లపై తమ పోరాటం ముగిసిపోలేదని, చట్టాన్ని అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు.

## రైల్వే ట్రాక్‌ను పేల్చేందుకు యత్నించి..
## ప్రాణాలు కోల్పోయి..



పంజాబ్‌లోని పటియాలలో శంభు ప్రాంతంలో సోమవారం రాత్రి పేలుడు సంభవించింది. శంభు అంబాల రైల్వే ట్రాక్ సమీపంలో జరిగిన ఈ ఘటన కుట్రపూరిత యత్నమని తాజాగా పోలీసులు వెల్లడించారు. పేలుడుకు యత్నించిన వ్యక్తి ఆ ఘటనలోనే ప్రాణాలు కోల్పోయాడని పేర్కొన్నారు. శంభుఅంబాల రైల్ ట్రాక్‌ను సరకు రవాణాకు కేటాయించారు. దాని సమీపంలో పేలుడు జరిగిన సమాచారాన్ని అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ ధాటికి ఛిద్రమైన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. తొలుత తక్కువ తీవ్రత గల పేలుడని అధికారులు భావించినా.. అది కుట్రపూరిత యత్నమని దర్యాప్తులో తెలుసుకొన్నారు. "ఘటనాస్థలం నుంచి ఒక సిమ్ కార్డును స్వాధీనం చేసుకున్నాం. ఇతర ఆధారాలను సేకరించాం. వీటి ఆధారంగా త్వరలో ఈ కుట్రను ఛేదిస్తాం'' అని పటియాలా పోలీసు ఉన్నతాధికారి వరుణ్ శర్మ వెల్లడించారు.

## హిప్పోలను చంపొద్దు: ఆ దేశాన్ని కోరిన అనంత్ అంబానీ



రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ గొప్ప మనసు చాటుకున్నారు. తమ దేశంలోని 80 హిప్పోపొటమస్‌లను చంపాలనుకుంటున్నట్లు కొలంబియా ప్రభుత్వం చేసిన ప్రకటనపై స్పందించారు. ఆ నీటి ఏనుగులను చంపొద్దని.. వాటికి వంతారా జంతు సంరక్షణ కేంద్రంలో శాశ్వత నివాసం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు కొలంబియా పర్యావరణ, సుస్థిర అభివృద్ధి శాఖకు అభ్యర్థనను పంపారు. ప్రాణం ఉన్న జీవులుగా వాటికి జీవించే హక్కు ఉందని..వాటికి కావాల్సిన అన్ని సదుపాయాలు, సురక్షితమైన పరిస్థితులను తాము కల్పిస్తామని పేర్కొన్నారు. తమ ప్రతిపాదనను సమగ్రంగా అంచనా వేసే వరకు నీటి ఏనుగులను చంపాలనుకునే ఆలోచనను విరమించుకోవాలని కొలంబియాను వంతారా అధికారికంగా అభ్యర్థించింది. ఈ విషయంపై త్వరలో వివరణాత్మక ప్రతిపాదనను సమర్పించడానికి కొలంబియా అధికారులను నేరుగా సంప్రదిస్తామని పేర్కొంది.

*** హిప్పోలను ఎందుకు చంపాలనుకున్నారు..?**

కొలంబియాలోని మగ్దలీనా నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న నీటి ఏనుగుల వల్ల అక్కడి జీవవైవిధ్యానికి, పర్యావరణ వ్యవస్థకు హాని కలుగుతుండడంతో వాటిని చంపేయాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించుకుంది. వాటి వల్ల ప్రజలకు కూడా ప్రమాదం పొంచి ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ హిప్పోలు దక్షిణ అమెరికాకు చెందినవి కావు. వీటిని అప్పట్లో డ్రగ్ వ్యాపారి ఎస్కోబార్ ఆఫ్రికా నుంచి తీసుకువచ్చి తన సొంత జూలో ఉంచాడు. అనంతరం ఎస్కోబార్‌ను అరెస్టుచేయడంతో అతని అధ్యాయం ముగిసింది. వీటి సంరక్షణ పట్టించుకోకపోవడంతో నదీ పరివాహక ప్రాంతంలో ఉంటున్నాయి. వీటి సంతతి బాగా పెరగడంతో ఆహారం కోసం జనావాస ప్రాంతాలకు విస్తరించాయి. ప్రజలపై దాడులు చేయడం, చేపలు, తాబేళ్లను చంపుతుండటంతో వీటి జనాభా నియంత్రించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా 80 హిప్పోలను చంపివేయాలని ప్రభుత్వ అధికారులు ప్రతిపాదించారు.

**వంతారా..**

రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనంత్ అంబానీ నిర్వహిస్తున్న అతిపెద్ద వన్యప్రాణుల పునరావాస కేంద్రం వంతారా . ఈ అభయారణ్యం గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కొన్ని వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో 2వేలకు పైగా జంతువులు ఉన్నాయి. వేటగాళ్ల బారిన పడి గాయపడిన లేదా నిరాదరణకు గురైన జంతువులను వంతారా బృందం రక్షించి వాటికి ప్రత్యేక వైద్య సంరక్షణ, పునరావాస సదుపాయాలు కల్పిస్తుంది.

## తమిళనాడులో అడ్వకేట్‌గా..
## రాజీవ్‌గాంధీ హత్యకేసు దోషి



మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో దోషిగా శిక్ష అనుభవించిన ఎ.జి.పేరరివాళన్.. తాజాగా అడ్వకేట్‌గా మారారు. తమిళనాడు పుదుచ్చేరి బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ఇటీవల తన పేరు నమోదు చేసుకున్నారు. రాజీవ్ గాంధీ హత్య కేసులో 31 ఏళ్లపాటు జైలు జీవితం గడిపిన పేరరివాళన్ 2022లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విడుదలయ్యారు. ఆ తర్వాత బెంగళూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కాలేజీలో న్యాయవిద్యను అభ్యసించారు. అక్కడ డిగ్రీ పూర్తి చేసి.. 2025లో ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ రాసి ఉత్తీర్ణులయ్యారు. త్వరలో ఆయన మద్రాస్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయనున్నారు. ఈ సందర్భంగా పేరరివాళన్ మీడియాతో మాట్లాడుతూ.. సరైన న్యాయ సహాయం అందక జైళ్లల్లో మగ్గిపోతున్న వేలాది మంది ఖైదీల గొంతుకగా మారడమే తన లక్ష్యమన్నారు. న్యాయం అందని నిరుపేద జీవిత ఖైదీల కోసం తాను పనిచేయాలనుకుంటున్నట్లు వెల్లడించారు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీ పెరంబదూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న రాజీవ్‌గాంధీపై ఓ మహిళ ఆత్మాహుతి దాడికి పాల్పడింది. ఆ బాంబు తయారీకి అవసరమైన రెండు బ్యాటరీలను (తొమ్మిది వోల్టులు) 19 ఏళ్ల పెరారివాళన్ కొనుగోలు చేసి ఇచ్చారనే అభియోగాలపై అరెస్టయ్యారు. ఈ కేసులో ఆయనకు 1998లో తొలుత ఉగ్రవాద వ్యతిరేక కోర్టు మరణశిక్ష విధించగా.. 2014లో సుప్రీంకోర్టు దాన్ని జీవిత ఖైదుగా మార్చింది. ఆ తర్వాత ఆ రాష్ట్ర గవర్నర్ క్షమాభిక్ష ప్రసాదించడంతో.. ఆయన్ను విడుదల చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

## డిజిటల్ అరెస్టులపై 'బయోమెట్రిక్' అస్త్రం!

కొంతకాలంగా దేశంలో 'డిజిటల్ అరెస్ట్' మోసాలు పెను ముప్పుగా మారుతున్నాయి. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అనేకమంది ఈ తరహా మోసాల బారిన పడుతుండటంపై సుప్రీంకోర్టు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ క్రమంలోనే డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లను అరికట్టేలా కేంద్రం పలు నిబంధనలను ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన నివేదికను తాజాగా అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించింది. ఈ మోసాల కట్టడికి బయోమెట్రిక్ సిమ్ వెరిఫికేషన్, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నిలిపివేత వంటి చర్యలను కేంద్రం అందులో పేర్కొంది. పలు రంగాల నిపుణులు, ప్రభుత్వ అధికారులతో సంప్రదింపుల అనంతరం కేంద్రం ఈ నివేదికను రూపొందించింది. దీన్ని పరిశీలించిన అనంతరం ప్రతిపాదనల అమలు కోసం టెలీకమ్యూనికేషన్ విభాగం, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ, ఆర్‌బీఐ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సుప్రీంకోర్టును కేంద్రం కోరింది. కేంద్రం తరపున అటార్నీ జనరల్ ఈ నివేదికను న్యాయస్థానానికి సమర్పించింది.

**కేంద్రం సిఫార్సులు ఇవే..**

* సిమ్ కార్డు జారీ చేసే సమయంలో టెలీకమ్యూనికేషన్ (యూజర్ ఐడెంటిఫికేషన్) రూల్స్, బయోమెట్రిక్ ఐడెంటిటీ వెరిఫికేషన్ వ్యవస్థను కఠినంగా అమలు చేయాలి. టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు నిబంధనలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలి.
* సిమ్ యాక్టివేషన్ చేసే పాయింట్ ఆఫ్ సేల్స్ (పీఓఎస్) విక్రయదారులను ఎప్పటికప్పుడు వెరిఫికేషన్ చేయాలి. కేసుల దర్యాప్తు సమయంలో సబ్‌స్క్రైబర్ యాక్టివేషన్ వివరాలు అందించాలని పీఓఎస్, టెలికాం ఆపరేటర్లను ఆదేశించాలి.
* డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లతో సహా సైబర్ క్రైమ్ నేరాలకు ఉపయోగించే మోసపూరిత సిమ్ కార్డులను వీలైనంత త్వరగా బ్లాక్ చేయాలి.
* వాట్సప్ వంటి యాప్‌లు సిమ్ బైండింగ్ మెకానిజంను కఠినంగా అమలుచేయాలి. ఎక్కువసేపు సాగే మోసపూరిత కాల్స్‌ను గుర్తించేలా ఈ యాప్‌లో అధునాతన ఫీచర్లను తీసుకురావాలి.

# భగ్గుమన్న క్రూడ్ ఆయిల్..

భారీ నష్టాల్లో మార్కెట్లు

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

అంతర్జాతీయంగా ముడిచమురు
ధరలు పెరగడంతో సెంటిమెంట్ కు విఘాతం

సెన్సెక్స్ కు 416 పాయింట్లు, నిఫ్టీకి 97 పాయింట్లు నష్టం

ప్రధాన సూచీలు పతనమైనా మిడ్, స్మాల్ క్యాప్ షేర్లకు లాభాలు

డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.54కు పతనం



**ముంబై:** పశ్చిమాసియాలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభనతో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఫలితంగా, మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 416.72 పాయింట్లు నష్టపోయి 76,886.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 97 పాయింట్లు క్షీణించి 23,995.70 వద్ద ముగిసింది. ప్రధాన సూచీలు నష్టపోయినప్పటికీ, మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు మాత్రం లాభాలతో రాణించడం విశేషం. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.28 శాతం, స్మాల్‌క్యాప్ 0.42 శాతం మేర లాభపడ్డాయి. సెన్సెక్స్‌లో అదానీ పోర్ట్స్, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా షేర్లు లాభపడగా.. హెచ్‌సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ షేర్లు లాభాలను నమోదు చేశాయి.

వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ చేసిన ప్రతిపాదన పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తిగా ఉన్నారని వచ్చిన నివేదికలతో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడింది. దీంతో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 2.78 శాతం పెరిగి 111.24 డాలర్లకు చేరింది. ముడిచమురు ధరల పెరుగుదల భారత్ వంటి దిగుమతులపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా 0.38 శాతం క్షీణించి 94.54 వద్ద ట్రేడ్ అయింది.

## తగ్గిన మారుతీ సుజుకీ లాభం..

ఒక్కో షేరుకు రూ. 140 డివిడెండ్




**న్యూఢిల్లీ:** ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.3659 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3911.1 కోట్ల నికర లాభంతో పోలిస్తే లాభం 6.45 శాతం క్షీణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో వాహనాలను విక్రయించినా.. లాభాల్లో క్షీణత నమోదు కావడం గమనార్హం.

మార్కెట్- టు- మార్కెట్ ప్రభావం కారణంగా లాభంలో క్షీణత నమోదైందని మారుతీ సుజుకీ తెలిపింది. నిర్వహణేతర లాభాలు క్షీణించడం, బాండ్ రాబడులు తగ్గడం వంటివి లాభాలపై ప్రభావం చూపాయని పేర్కొంది. భవిష్యత్‌లో ఇవి భర్తీ అవుతాయని తెలిపింది. కార్యకలాపాల ద్వారా ఆదాయం 28.2 శాతం వృద్ధితో రూ.40,920.1 కోట్ల నుంచి రూ.52,462.5 కోట్లకు పెరిగినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో రూ.50 వేల కోట్ల విలువైన విక్రయాలు నమోదు చేసినట్లు కంపెనీ తెలిపింది. మొత్తంగా 6,76,209 యూనిట్లను విక్రయించగా.. అందులో 5.38 లక్షల యూనిట్లను దేశీయంగా, 1.37 లక్షల వాహనాలను విదేశాలకు ఎగుమతి చేసినట్లు తెలిపింది.

ఇక పూర్తి ఆర్థిక సంవత్సరానికి కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం రూ.1,52,913 కోట్ల నుంచి రూ.1,83,316 కోట్లకు పెరిగినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. లాభం రూ.14,679.5 కోట్లుగా నమోదైంది. ఏడాది మొత్తంలో 19.74 లక్షల యూనిట్లను దేశీయంగా విక్రయించగా.. 4.47 లక్షల యూనిట్లను ఎగుమతి చేసినట్లు మారుతీ సుజుకీ వెల్లడించింది. ఈ సందర్భంగా డివిడెండ్‌నూ మారుతీ సుజుకీ ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.140 చొప్పున చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

## నాలుగింతలు
## పెరిగిన ఎటెర్నల్ లాభం




**న్యూఢిల్లీ:** జొమాటో, బ్లింకిట్ పేరిట ఫుడ్, క్విక్ కామర్స్ వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎటెర్నల్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో నాలుగింతలకుపైగా నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.39 కోట్లుగా ఉన్న లాభం.. ఈ ఏడాది రూ.174 కోట్లకు పెరిగింది. కంపెనీ ఆదాయం సైతం గతేడాదితో పోలిస్తే రూ.5,833 కోట్ల నుంచి రూ.17,292 కోట్లకు పెరిగింది. అదే సమయంలో ఖర్చులు రూ.6104 కోట్ల నుంచి రూ.17,406 కోట్లకు పెరిగినట్లు కంపెనీ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో క్విక్ కామర్స్ విభాగం బ్లింకిట్ నెట్ ఆర్డర్ వాల్యూ ఏడాది ప్రాతిపదికన 95.4 శాతం వృద్ధిని సాధించింది. ఈ త్రైమాసికంలో కొత్తగా 216 స్టోర్లను ప్రారంభించడంతో మొత్తం స్టోర్ల సంఖ్య 2,243కి చేరింది. అలాగే, జొమాటో 18.8 శాతం వృద్ధిని కనబరిచింది. దీని సవరించిన ఎబిటా రూ.532 కోట్లుగా ఉంది. పేటీఎం నుంచి కొనుగోలు చేసిన టికెటింగ్ ప్లాట్‌ఫామ్ డిస్ట్రిక్ట్ ఆదాయం 46.5 శాతం పెరిగింది. నష్టాలు రూ.121 కోట్ల నుంచి రూ.81 కోట్లకు తగ్గాయి.

# దూబే, ఫెరీరా విధ్వంసం..

పంజాబ్ జైత్రయాత్రకు బ్రేక్..!

**ఛండీగర్:** పంతొమ్మిదో సీజన్‌లో భారీ లక్ష్యాలను అలవోకగా ఛేదిస్తూ అజేయంగా దూసుకెళ్తున్న పంజాబ్ కింగ్స్‌కు షాకిచ్చింది రాజస్థాన్ రాయల్స్. ఆరు విజయాలతో టేబుల్ టాపర్‌గా కొనసాగుతున్న పంజాబ్‌కు తొలి ఓటమి రుచి చూపించింది. 223 లక్ష్య ఛేదనలో యశస్వీ జైస్వాల్(51), వైభవ్ సూర్యవంశీ(43)లు మెరుపు ఆరంభమివ్వగా.. డొనొవాన్ ఫెరీరా(52 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ శుభం దూబే(31 నాటౌట్)లు డెత్ ఓవర్లలో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఆరో విజయంతో మూడో స్థానానికి దూసుకెళ్లింది రాజస్థాన్.

ఐపీఎల్-19లో పంజాబ్ కింగ్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఎదురైన ప్రత్యర్థినల్లా ఓడిస్తున్న పంజాబ్‌కు సొంత మైదానంలో రాజస్థాన్ రాయల్స్ ఊహించని పంచ్ ఇచ్చింది. ముల్లన్‌పూర్‌లో నిర్దేశించిన 223 పరుగుల ఛేదనను రాజస్థాన్ రాయల్స్ ధాటిగా మొదలెట్టింది. తొలి ఓవర్లోనే అర్ష్‌దీప్ సింగ్‌కు చుక్కలు చూపిస్తూ వైభవ్ సూర్యవంశీ(43) 6, 4, 4 బాదాడు. అనంతరం యాన్సెన్, ఫెర్గూసన్ ఓవర్లోనూ వైభవ్ విధ్వంసంతో





20 బంతుల్లోనే 51 పరుగులు చేసింది రాజస్థాన్.

అర్ధ శతకానికి చేరువైన వైభవ్ ఆ తర్వాతి బంతికే అయ్యర్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ధ్రువ్ జురెల్()ను చాహల్ ఔట్ చేసి రెండో వికెట్ అందించాడు. కాసేపు షాట్లతో అలరించిన యశస్వీ జైస్వాల్()ను సైతం వెనక్కి పంపిన చాహల్.. కెప్టెన్ రియాన్ పరాగ్()ను పెవిలియన్ చేర్చాడు. చాహల్ వేసిన 14వ ఓవర్లో తొలి రెండు బంతుల్ని 6, 4 గా మలిచిన పరాగ్ చివరి బంతికి ఔటయ్యాడు.

### దూబే, ఫెరీరా ధనాధన్

వెంట వెంటనే వికెట్లు పడినా ఇంప్యాక్ట్ సబ్‌గా వచ్చిన శుభమ్ దూబే(31 నాటౌట్) డొనొవాన్ ఫెరారా(52 నాటౌట్)లు అదరలేదు. గెలుపు బాధ్యత తీసుకున్న ఈ జోడీ పంజాబ్ నుంచి మ్యాచ్‌ను లాగేసుకుంది. అర్ష్‌దీప్ వేసిన 18వ ఓవర్లో ఫెరీరా 6, 4.. చివరి బంతిని దూబే స్టాండ్స్‌లోకి పంపగా మ్యాచ్ రాజస్థాన్ వైపు మళ్లింది. 12 బంతుల్లో 18 రన్స్ అవసరమైన వేళ.. ఫెర్గూసన్ బౌలింగ్‌లో 4, 6 బాదిన ఫెరీరా పంజాబ్ ఓటమిని ఖాయం చేశాడు. యాన్సెన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో స్ట్రెయిట్ సిక్సర్‌తో అర్ధ శతకం సాధించిన ఫెరీరా.. రాజస్థాన్‌కు 6 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు.

ప్రభ్‌సిమ్రన్, స్టోయినిస్ మెరుపులు

పంజాబ్ కింగ్స్ ముల్లన్‌పూర్ భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(59) ఎప్పటిలానే శుభారంభమివ్వగా.. కూపర్ కొన్నొల్లీ(30), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(30)లు దంచేశారు. డెత్ ఓవర్లలో మార్కస్ స్టోయినిస్(62 నాటౌట్) సిక్సర్ల మోతతో పంజాబ్ స్కోర్ 200 దాటింది. బ్రిజేశ్ శర్మ వేసిన చివరి ఓవర్లో 4, 6 , 6 తో అర్ధ శతకం సాధించిన స్టోయినిస్ చివరి రెండు బంతుల్నీ బౌండరీ దాటించాడు. దాంతో, పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది.

## విద్యార్థులు నిబద్ధతతో కలలను సాకారం చేసుకోవాలి



విరాట్ కోహ్లీ

**న్యూఢిల్లీ:** విద్యార్థులు నిజాయితీ, నిబద్ధతతో తమ కలలను సాకారం చేసుకోవాలని క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ అన్నారు. మంగళవారం ఢిల్లీలోని ఆర్కే పురం డీపీఎస్‌లో జరిగిన క్రికెట్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్ఫూర్తిదాయక సందేశం ఇచ్చారు. విద్యార్థులు చదువును గౌరవించాలన్నారు. చిన్ననాటి తన పాఠశాల అనుభవాలను గుర్తు చేసుకున్నారు.

క్రికెట్‌ను తన కెరీర్ మార్గంగా ఎంచుకున్నప్పుడు తన ప్రాధాన్యతలు చిన్నప్పుడే ఎలా మారాయో విద్యార్థులకు విరాట్ వివరించారు. నాకు పాఠశాలల్లో మాట్లాడటం అలవాటు లేదన్నారు. ఇది నాకు కొంచెం ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఎందుకంటే నేను క్రికెట్ కోసం చాలా కాలం క్రితమే పాఠశాల వాతావరణానికి దూరమయ్యానని పేర్కొన్నారు. పాఠశాల అనేది మీరు నేర్చుకోవడానికి, ఎదగడానికి, మంచి వ్యక్తులుగా మారడానికి అత్యుత్తమైన వేదిక అన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తారన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వాన్ని, సామర్థ్యాన్ని తీర్చిదిద్దడంలో వారి పాత్ర ప్రశంసనీయమన్నారు. వారు తమ జీవితంలో కొంత భాగాన్ని మీకు కోసం కేటాయిస్తున్నారు. మీ ఉపాధ్యాయుల పట్ల గౌరవంగా ఉండాలని సూచించారు.

## ప్రపంచకప్ పోటీలకు 18 ఏళ్ల స్పిన్నర్..

**లండన్:** సొంతగడ్డపై జరుగబోయే మహిళల టీ20 వరల్డ్‌కప్ కోసం ఇంగ్లండ్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. నాటీ సీవర్ బ్రంట్ కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని ప్రపంచకప్ పోటీలకు సోమవారం ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు ఎంపిక చేసింది. ఆశ్చర్యంగా 18 ఏళ్ల అమ్మాయి టిల్లీ కార్టిన్ కొలెమన్‌ను సెలెక్టర్లు స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. ఈమధ్యే 'ది హండ్రెడ్ లీగ్'లో అదరగొట్టిన ఈ ఎడమచేతి వాటం స్పిన్నర్ తొలి ప్రపంచకప్ ఆడనుంది.

పొట్టి వరల్డ్‌కప్ స్క్వాడ్ ఎంపికలో ఇంగ్లండ్ సెలెక్టర్లు అనుభవంతో పాటు ప్రతిభకు పట్టం కట్టారు. సీనియర్లకు చోటు కల్పించడమే కాకుండా స్పిన్ సంచలనంగా అవతరించిన 18 ఏళ్ల టిల్లీ కార్టిన్ కొలెమన్‌ను మెగా టోర్నీకి ఎంపి చేశారు. ఇటీవలే స్వదేశంలో ముగిసిన మహిళల ది హండ్రెడ్ లీగ్‌లో 9 మ్యాచుల్లోనే 11 వికెట్లు తీసిన ఈ టీనేజర్ .. సదర్న్ బ్రేవ్స్ జట్టు ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించింది. అనంతరం దేశవాళీ క్రికెట్‌లోనూ తిప్పేసిన టిల్లీ ఏడు ఇన్నింగ్స్‌ల్లో 10 వికెట్లతో సెలెక్టర్ల దృష్టిలో పడింది. ప్రపంచకప్‌లో సీనియర్లు సోఫీ ఎకిల్‌స్టోన్, లిన్సే స్మిత్, చార్లీ డీన్‌తో కలిసి టిల్లీ స్పిన్ మ్యాజిక్ చూపించనుంది.



**ఇంగ్లండ్ స్క్వాడ్:** నాట్ సీవర్ బ్రంట్, లారెన్ బెల్, అలిసే క్యాప్సే, టిల్లి కార్టిన్ కొలెమన్, చార్లీ డీన్, సోఫియా డంక్లే, సోఫీ ఎకిల్‌స్టోన్, లారెన్ ఫైలెర్, డాని గిబ్సన్, అమీ జోన్స్, ఫ్రెయా కెంప్, హీథర్ నైట్, లిన్సే స్మిత్, ఇస్సీ వాంగ్, డానీ వ్యాట్ హెడ్గే.

స్క్వాడ్ ఎంపిక అనంతరం హెడ్‌కోచ్ చార్లొట్టే ఎడ్వర్డ్స్ మాట్లాడుతూ.. 'మేము ప్రపంచకప్ స్క్వాడ్‌ను ప్రకటించాం. చాలా కష్టంగా అద్భుతమైన 15 మందిని ఎంపిక చేశాం. సెలెక్షన్ చాలా కష్టంగా అనిపించింది. ప్రతిభావంతులైన చాలామందికి స్క్వాడ్‌లో చోటు దక్కింది. మేము కోరుకున్న జట్టు ఇది. కఠినమైన నిర్ణయాలను సైతం మేము తేలికగా తీసుకోమని చెప్పడానికి ఇది నిదర్శనం.

# రెజ్లింగ్ సమాఖ్య నాపై కక్ష కట్టింది..

పునరాగమనానికి అడ్డుపడుతోంది.!

**న్యూఢిల్లీ:** పారిస్ ఒలింపిక్స్ అనంతరం రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికిన వినేశ్ ఫొగాట్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది. రిటైర్మెంట్‌పై యూటర్న్ తీసుకున్న ఆమె... భారత రెజ్లింగ్ సమాఖ్య ఉద్దేశపూర్వకంగానే తనను కుస్తీ పోటీల్లో పాల్గొనకుండా అడ్డుపడుతుందని ఆరోపించింది. ఆసియా క్రీడల ట్రయల్స్ కోసం 'జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్'లో పేరు నమోదు చేసుకోనివ్వకుండా డబ్ల్యూఎఫ్ఐ ఆటంకాలు సృష్టిస్తోందని ఫొగాట్ మండిపడింది.

ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందిస్తున్న వినేశ్ ఫొగాట్ రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికి 20 నెలలు అవుతోంది. పారిస్ విశ్వక్రీడల్లో అధిక బరువు కారణంగా పతకం చేజార్చుకున్న ఆమె.. ఒలింపిక్స్ పతకం లక్ష్యంగా మళ్లీ కుస్తీ పోటీల్లో పాల్గొనాలని నిర్ణయించుకుంది. ఆసియా క్రీడలతో పునరాగమనం చేయాలని భావించిన ఆమెకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగానే తనకు భారత రెజ్లింగ్ సమాఖ్య అడ్డుపడుతోందని వినేశ్ అంటోంది.

'నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌తో నేను పునరాగమనం చేయాలని ఆశిస్తున్నా. అందుకు రిజిస్ట్రేషన్ గడువు ఏప్రిల్ 30వ తేదీ వరకూ ఉంది. నేనే పేరు నమోదు చేసుకునేందుకు ప్రయత్నించగా వెబ్‌సైట్ పోర్టల్‌లో దరఖాస్తు ప్రక్రియ ముగిసింది అని చూపిస్తోంది. ఈ విషయమే రెజ్లింగ్ సమాఖ్య సిబ్బందిని సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించాను. కానీ, వారు నా ఫోన్ ఎత్తడం లేదు అని వినేశ్




ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంస్థతో తన గోడును వెళ్లబోసుకుంది. రెజ్లింగ్ సమాఖ్య నుంచి ఇలా తిరస్కారాలకు గుర్వవడం ఇదే మొదటిసారి కాదని, ఫెడరేషన్ కప్ సమయంలోనూ తనకు ఇదే పరిస్థితి ఎదురైందని వినేశ్ వాపోయింది.

'ఫెడరేషన్ కప్‌లో నేను పోటీపడాలనుకున్నా. కానీ, ఆఖరి నిమిషంలో జట్టు ఎంపికలో మార్పులు చేశారు. కాబట్టి నేను పాల్గొనలేకపోయాను. ఇప్పుడు ఆసియా క్రీడలకు సిద్ధమవ్వాలనుకున్న నన్ను నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పేరు రిజిష్టర్ చేసుకోకుండా అడ్డుపడుతున్నారు. ఇదంతా ఉద్దేశపూర్వంగానే జరుగుతోంది. నేను పునరాగమనం చేయడం డబ్ల్యూఎఫ్ఐకి ఇష్టం లేదనిపిస్తోంది' అని వినేశ్ ఫొగాటో పేర్కొంది.

### ఎవరినీ అడ్డుకోము

రెజ్లింగ్ సమాఖ్య మాత్రం వినేశ్ ఫొగాట్ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. రిజిస్ట్రేషన్ సమయంలో వినేశ్ ఒక్కరే కాదు చాలామంది రెజ్లర్లు సమస్యలు ఎదుర్కొన్నారని డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్ తెలిపాడు. 'వినేశ్ మాదిరిగానే ఇతర రెజ్లర్ల నుంచి కూడా మాకు ఫిర్యాదులు వస్తున్నాయి. వారికి మా సిబ్బంది సహాయం చేసి వారి సమస్యకు పరిష్కారం చూపించారు. మేము పోటీలో పాల్గొనకుండా ఎవరినీ అడ్డుకోము. ఎందుకంటే.. ఈ టోర్నమెంట్‌లో అందరూ పోటీపడవచ్చు' అని సంజయ్ సింగ్ వెల్లడించారు. ఆసియా క్రీడలు సెప్టెంబర్‌లో, అనంతరం అక్టోబర్‌లో వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ ప్రారంభం కానున్నాయి.

MOVIE TIME

# లుక్ టెస్ట్ పూర్తయ్యింది


చిరు-బాబీ కాంబినేషన్‌లో మూవీ



**టాకీస్:** అగ్ర కథానాయకుడు చిరంజీవి ఫుల్ జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతోన్న ఆయన తాజాగా కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన లుక్ టెస్ట్‌ను పూర్తి చేశారు. బాబీ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా రెండో సినిమా రానున్న విషయం తెలిసిందే. మెగా 158గా ఇది ప్రచారంలో ఉంది. ఈ సినిమా అప్‌డేట్‌ను దర్శకుడు పంచుకున్నారు. ఈ రోజు లుక్‌టెస్ట్ పూర్తయిందని..త్వరలోనే షూటింగ్ ప్రారంభించేం దుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చిరు ఫొటోషూట్‌కు సంబంధించిన ఫొటోను షేర్ చేస్తూ 'హింసకు ముందు నిశ్శబ్దం' అనే క్యాప్షన్ రాశారు. దీంతో భారీ స్థాయి యాక్షన్ చిత్రంగా ఇది రానున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి – బాబీ కాంబినేషన్‌లో గతంలో 'వాల్తేరు వీరయ్య' రూపొందింది. 2023లో వచ్చిన ఈ చిత్రం మంచి ఆదరణను సొంతం చేసుకోవడంతో వీరి రెండో సినిమాపై అంచనాలు నెలకొన్నాయి.

# పండుగాడి జర్నీకి 20 ఏళ్లు

పోకిరి విడుదలై సరిగ్గా రెండు దశాబ్దాలు



**టాకీస్:** తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించి, బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టించిన 'పోకిరి' చిత్రం సరిగ్గా 20 వసంతాలను పూర్తి చేసుకుంది. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం ఇదే రోజున 2006 ఏప్రిల్ 28న విడుదలైన ఈ సినిమా, అప్పటి వరకు ఉన్న తెలుగు సినిమా బాక్సాఫీస్ లెక్కలను పూర్తిగా మార్చివేసింది. ఈ చిత్రం సూపర్ స్టార్ మహేష్ బాబును మాస్ ప్రేక్షకులకు అత్యంత చేరువ చేయడమే కాకుండా, ఆయనను తిరుగులేని పవర్‌హౌస్‌గా నిలబెట్టింది. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ మార్క్ మేకింగ్, పదునైన సంభాషణలు మరియు మహేష్ బాబు అల్ట్రా మోడ్రన్ లుక్ కలిసి వెండితెరపై ఒక మ్యాజిక్ చేశాయి. దాదాపు రూ.12 కోట్ల పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, ఏకంగా రూ.66 కోట్లకు పైగా వసూళ్లను సాధించి అప్పట్లో 'ఇండస్ట్రీ హిట్'గా రికార్డు సృష్టించింది. కేవలం వసూళ్ల పరంగానే కాకుండా, సాంకేతికంగానూ ఈ చిత్రం సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ముఖ్యంగా మణిశర్మ అందించిన అద్భుతమైన సంగీతం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రతి థియేటర్లో వైబ్రేషన్స్ పుట్టించాయి. హీరోయిన్ ఇలియానాకు ఈ సినిమా ఓవర్ నైట్ స్టార్‌డమ్ తీసుకురాగా, విలన్‌గా ప్రకాష్ రాజ్ నటన సినిమాకు ప్రాణం పోసింది.




# దర్శకురాలిగా మారతానంటున్న ఫరియా అబ్దుల్లా..

'గాయపడ్డ సింహం' ప్రమోషన్స్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు

టాకీస్: 'జాతిరత్నాలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఫరియా అబ్దుల్లా , చిట్టి పాత్రతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. తన సహజ నటన, భావ వ్యక్తీకరణతో యువతలో ప్రత్యేక స్థానం సంపాదించిన ఆమె, ఇప్పుడు 'గాయపడ్డ సింహం' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా విడుదలకు ముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఫరియా పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్ హీరోగా నటించగా, ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలు గా కనిపించనున్నారు. తాను ఇందులో శాలిని అనే వ్లాగర్ పాత్రలో కనిపిస్తానని, చిన్న పాత్ర అయినప్పటికీ కథలో ప్రాధాన్యం ఉంటుందని ఫరియా తెలిపింది. తరుణ్ భాస్కర్‌తో ఒక ప్రేమ కథాంశం కూడా ఉంటుందని, దర్శకుడు కశ్యప్ కథను చాలా భిన్నంగా రూపొందించారని చెప్పింది. ఆయన సృష్టించిన పాత్రలు, కథా ప్రపంచం చాలా వినోదాత్మకంగా ఉ ంటాయని వెల్లడించింది. ఈ సినిమా పలు స్థాయిల్లో సాగే కథగా ఉ ంటుందని, ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని ఫరియా వివరించింది. తన పాత్రలో హాస్య అంశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రేక్షకులు సినిమా చూసిన తర్వాత మళ్లీ చూడాల నిపించేలా ఉ ంటుందని ఆమె ధీమా వ్యక్తం చేసింది. కథ నచ్చితే పాత్ర నిడివి గురించి పట్టించుకోకుండా నటిస్తానని ఫరియా పేర్కొంది. ఈ కథ వినగానే కొత్తగా అనిపిం చిందని, ప్రేక్షకులు ఖచ్చితంగా ఆనందిస్తారని ఆమె నమ్మకం వ్యక్తం చేసింది. తరుణ్ భాస్కర్‌తో పనిచేసిన అనుభవాన్ని గురించి మాట్లాడుతూ, ఆయన చాలా సరదాగా ఉంటారని, ఆయన హాస్య టైమింగ్ ప్రత్యేకమని చెప్పింది. చిన్న అభినయంతోనే నవ్వు తెప్పించగల సామర్థ్యం ఉందని పేర్కొంది. సినిమా తుది రూపం చాలా బాగా వచ్చిందని, ఇది విజయవంత మవుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ చిత్రంలో శ్రీ విష్ణు పాత్ర కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుందని, దానిని ఎంతో చక్కగా రూపొందించారని తెలిపింది. మానస చౌదరి హీరోను వదిలే పాత్రలో కనిపిస్తే, తాను అతనికి అండగా నిలిచే పాత్రలో నటించానని సరదాగా చెప్పింది. ఇక తన భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ, ప్రస్తుతం కొన్ని కథలు రాస్తున్నానని, వచ్చే ఏడాది తన దర్శకత్వంలో సినిమా చేయాలని భావిస్తున్నానని ఫరియా వెల్లడించింది. ప్రస్తుతం 'భగవంతుడు', 'సిగ్మా' వంటి చిత్రాలతో పాటు సత్యదేవ్ కంచరణతో ఒక సినిమా కూడా చేస్తున్నానని తెలిపింది. 'గాయపడ్డ సింహం'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైన ఫరియా అబ్దుల్లా, భవిష్యత్తులో దర్శకురాలిగా మారాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

# వరుస సినిమాలతో బాలయ్య బిజీ

కొరటాల శివతో తదుపరి మూవీ అంటూ ప్రచారం


**టాకీస్:** నందమూరి బాలకృష్ణ మాత్రం తన రూటే సెపరేటు అంటూ పయనిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వయసు 66 సంవత్సరాలు. అయినా ఓ వైపు నటునిగా బిజీగా ఉన్నారు. మరోవైపు హిందూపురం ఎమ్మెల్యేగా తన నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారు. అలాగే తన తల్లి పేరిట నెలకొన్న బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్ గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంత బిజీగా ఉన్నా ఈ సారి సినిమాల సంఖ్య పెంచాలని యోచిస్తున్నారు బాలయ్య. అందుకు తగ్గట్టుగానే పలువురు దర్శకులు, నిర్మాతలు ఆయనతో సినిమాలు తీయడానికి సిద్ధంగా ఉ న్నారు. ఈ నేపథ్యంలో ఓ సినిమా అయిన తరువాత మరో చిత్రాన్ని లైన్ లో పెడతారు ఎవరైనా. అయితే బాలయ్య ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ యాక్షన్ ఎంటర్ టైనర్ చేస్తున్నారు.ఆ సినిమా ఓ వైపు షూటింగ్ జరుపుకుంటూ ఉ ండగానే మరో చిత్రాన్ని లైన్ లో పెట్టనున్నారట బాలయ్య. ఈ మధ్యే బాలకృష్ణకు డైరెక్టర్ కొరటాల శివ ఓ సబ్జెక్ట్ వినిపించారు. ఆ సబ్జెక్ట్ బాలయ్యకు ఎంతగానో నచ్చిందని, త్వరలోనే షూటింగ్ మొదలు కానుందనీ సమాచారం. ప్రస్తుతం బాలయ్య హీరోగా గోపీచంద్ మలినేని రూపొందించే చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేసే ప్రయత్నంలో ఉన్నారు. వెంకట సతీశ్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.. ఇక బాలయ్యతో కొరటాల శివ రూపొందించే చిత్రానికి సాహు గారపాటి, మిక్కిలినేని సుధాకర్ నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. సమాంతరంగా ఈ రెండు చిత్రాల షూటింగ్ జరపనున్నారు. వేసవి పూర్తి కాగానే ఈ రెండు చిత్రాల కోసం డేట్స్ కేటాయించారు బాలకృష్ణ. రెండు సినిమాల్లో ఒకటి సంక్రాంతికి వస్తే, మరోటి ఎప్పుడు వస్తుందనే అనుమానం కలుగక మానదు. రెండు సినిమాలు వచ్చే సంవత్సరమే వెలుగు చూస్తాయని వినిపిస్తోంది. అయితే ఈ యేడాది బాలయ్య సినిమా లేనట్టేనా అని అభిమానులు నిరాశ చెందుతున్నారు. నిజానికి బాలయ్య-గోపీచంద్ మలినేని చిత్రాన్ని ఈ యేడాదే దసరా కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. కథలో మార్పులు జరగడం, క్యాస్టింగ్ లోనూ ఛేంజెస్ చోటు చేసుకోవడంతో బాలయ్య-గోపీచంద్ మలినేని మూవీ సంక్రాంతికి షిఫ్ట్ అయింది. మరి బాలయ్య – కొరటాల శివ మూవీ ఎప్పుడు ఎలా ప్రేక్షకులను పలకరిస్తుందో చూడాలి.



# మా ఇంటి బంగారం ప్రమోషన్స్

ఇంకా మొదలు పెట్టని నటి సమంత

**టాకీస్:** ఈ మధ్య కాలంలో ప్రేక్షకులను మెప్పించడం చాలా కష్టంగా మారింది. ఒకప్పుడు స్టార్ హీరో, స్టార్ హీరోయిన్ సినిమా వస్తోంది అంటే చాలు.. అది ఎలా ఉన్నా కూడా ఫ్యాన్స్ హిట్ చేసేవారు. కానీ, ఇప్పటి జనరేషన్ అలా కాదు. ఎంత పెద్ద స్టార్ అయినా సరే కంటెంట్ ఉంటేనే హిట్ చేస్తున్నారు. కంటెంట్ తో పాటు ప్రమోషన్స్ ని కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే ఈ మధ్య స్టార్ హీరోలు సైతం సరికొత్తగా ప్రచారాలు చేస్తూ తమ సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. అయితే తాజాగా స్టార్ హీరోయిన్ సమంత మాత్రం తన సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్ళలేకపోయారు అని టాక్ నడుస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నటిస్తోన్న తాజా చిత్రం మా ఇంటి బంగారం. నందినిరెడ్డి దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని సామ్ భర్త రాజ్ నిడిమోరు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మే 15 న ఈ చిత్రం రిలీజ్ కు సిద్ధమవుతోంది. రిలీజ్ ఇంకా పట్టుమని 15 రోజులు కూడా లేదు.. కానీ, ఇప్పటివరకు ఈ సినిమా ప్రమోషన్స్ మొదలుపెట్టలేదు. ఒకప్పుడు సామ్ సినిమా రిలీజ్ అంటే ఆ బజ్ వేరే లెవెల్ లో ఉండేది. కానీ, ఇప్పుడు అలా



లేదు. రాజ్ నిడిమోరుతో పెళ్ళి తరువాత సామ్ ఒకపక్క నిర్మాతగా.. ఇంకోపక్క హీరోయిన్ గా చేస్తున్న సినిమా మా ఇంటి బంగారం. ఓ బేబీ లాంటి హిట్ తరువాత సామ్- నందినిరెడ్డి కాంబోలోవస్తోన్న చిత్రం కావడంతో ఓ రేంజ్ లో బజ్ ఉంటుంది అనుకున్నారు. అయితే సామ్ మాత్రం ప్రమోషన్స్ చేయడంలో విఫలమయ్యారు అని చెప్పొచ్చు. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి ఒక్క ప్రమోషన్ ఇంటర్వ్యూ తప్ప ఇంకేమి రాలేదు. వెన్నెల కిషోర్ – సామ్ ఇంటర్వ్యూ రిలీజ్ అయినా కూడా అదేమీ అంతగా ఆసక్తి రేకెత్తించలేదు అని టాక్. అందుకనే ప్రేక్షకులు సైతం మా ఇంటి బంగారం సినిమాను పట్టించుకోవడం లేదని అంటున్నారు.

# మైఖేల్ మూవీ వసూళ్ల సునామీ

**టాకీస్:** దివంగత పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ప్రతిష్టాత్మక బయోపిక్ 'మైఖేల్' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన అతి తక్కువ కాలంలోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రికార్డులను తిరగరాస్తూ అంతర్జాతీయ స్థాయిలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.2000 కోట్లు మిలియన్ల మార్కుకు చేరువలో ఉండగా, భారత మార్కెట్‌లోనూ మైఖేల్ జాక్సన్‌కు ఉన్న తిరుగులేని క్రేజ్‌ను చాటుతూ రూ.20 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. కింగ్ ఆఫ్ పాప్ మ్యూజిక్, ఐకానిక్ డ్యాన్స్ మూమెంట్స్ మరియు ఆయన జీవితంలోని లోతైన సంఘర్షణలను దర్శకుడు ఆంటోనీ ఫుక్వా వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించడంతో అంతర్జాతీయ ప్రేక్షకులతో పాటు భారతీయ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ పాత్రలో ఒదిగిపోయిన తీరుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్ మరియు డ్యాన్స్ విన్యాసాలు చూస్తుంటే సాక్షాత్తు మైఖేల్ జాక్సనే మళ్లీ తిరిగి వచ్చారా అన్నట్లుగా ఉందని విమర్శకులు సైతం కొనియాడుతున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.